ప్రజాశక్తి

ఆదివారం 8 అక్టోబర్ 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

పాదయాత్ర ప్రారంభోత్సవంలో సిపిఎం నేతలు వి.శ్రీనివాసరావు, సిహెచ్.బాబూరావు, డివి.కృష్ణ, డి.కాశీనాథ్, బి.రమణారావు, కె.దుర్గారావు, సీతారాములు తదితరులు

# నగరాభివృద్ధికి ప్రణాళికలేవీ?

## ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు విష్ణుకు సిపిఎం నేత బాబూరావు ప్రశ్న

**ప్రజాశక్తి - విజయవాడ :** రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడిగా ఉన్న సెంట్రల్ ఎంఎల్ఎ మల్లాది విష్ణు....అవినీతి అక్రమాలకు పణాళికలు రచించారని, కానీ విజయవాడ నగరాభివృద్ధికి మాత్రం ప్రణాళికలు రచించలేకపోయారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు ఎద్దేవా చేశారు. 'సెంట్రల్ నియోజకవర్గ అభివృద్ధి – ప్రజా సమస్యలు పరిష్కారం కోసం' సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన ప్రజాపోరు పాదయాత్ర'ను శనివారం సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటరులో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు అధ్యక్షతన జరిగిన సభలో బాబూరావు మాట్లాడుతూ గుణదల ఫ్లైఓవర్, సింగ్‌నగర్ రెండో ఫ్లైఓవర్, నగరంలో వంతెనలు, ఆర్‌యుబిలు, డ్రైనేజి తదితర సమస్యల పరిష్కారంలో ఎంఎల్ఎ విష్ణు ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. గుణదల ఫ్లైఓవర్‌కు శంకుస్థాపన చేసి 13 ఏళ్లయిందని, మూడు ప్రభుత్వాలు మారినా నిర్మాణం పూర్తికాలేదని విమర్శించారు. ఇదే రీతిలో సింగ్‌నగర్ రెండో ఫ్లైఓవర్, ఆర్‌యుబిల నిర్మాణం జరగకపోవడంతో ఏళ్ల తరబడి ప్రజలు ట్రాఫిక్ (మిగతా 6లో)

డిజిటల్ పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఇన్చార్జి డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు

# కాలానుగుణంగా మార్పు అవసరం

## ● ఇన్చార్జి డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు ● డిజిటల్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

**ప్రజాశక్తి - విజయవాడ :** మారుతున్న కాలానికి అనుగుణంగా మనం మారగలిగినప్పుడు మాత్రమే విజయాన్ని అందుకోగలమని ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ కలెక్టర్, ఇన్చార్జి జిల్లా రెవెన్యూ అధికారి జి.వెంకటేశ్వర్లు అన్నారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన అనుపోజు జయశ్రీ ప్రభాకర్ డిజిటల్ పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోగలిగితే సమయంతోపాటు ధనాన్ని కూడా ఆదా చేసుకోవచ్చన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ పని చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన పూర్ణా హార్ట్ (మిగతా 6లో)

# కెనాల్స్ బోటింగ్‌పై విఎంసి దృష్టి

## ❁ ఇరిగేషన్, పర్యాటక శాఖల సహకారంతో ప్రాజెక్టు రూపకల్పనలో అధికారులు నిమగ్నం

**ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి**

పర్యాటకులకు, ప్రజలకు ఆహ్లాదాన్ని, అడ్వెంచర్ థ్రిల్లింగ్ అనుభూతిని అందించే కెనాల్స్ బోటింగ్‌పై విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ దృష్టి సారించింది. తద్వారా కార్పొరేషన్‌కు రెవెన్యూ తీసుకురావాలని అధికారులు ఆలోచనలు చేస్తున్నారు. విజయవాడ నగరం గుండా ప్రయాణించే ప్రధాన కాల్వల్లో దీనిని అందుబాటులోకి తేవాలని భావిస్తున్నారు. బందరు, ఏలూరు, రైవస్ కాల్వలు నగరంలో గుండా వెళుతున్నాయి. బోటింగ్‌తో వినోద కార్యకలాపాలను పెంచడమే కాకుండా డెవలప్‌మెంట్‌కు కూడా దోహదం చేస్తుందని భావిస్తున్నారు. ఆ మేరకు అధికారులు చర్చలు జరుపుతున్నారు. మరోవైపు కెనాల్ బోటింగ్ ప్రాజెక్టుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమైనట్లు తెలిసింది. ఈ ప్రాజెక్టు అమలుకు ఎంత ఖర్చవుతుంది, ఎన్ని బోట్లు అవసరమవుతాయి, కాల్వల్లో ఎంత దూరం వరకు ట్రావెలింగ్‌కు అనుకూలంగా ఉంటుంది, బోటింగ్‌కు కాల్వల్లో నీటి మట్టం ఎంతుండాలి, దానిని ఎలా మెయింటెయిన్ చేయాలి, మురుగు ప్రవేశించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, పర్యాటకులకు టికెట్ల ధరలు తదితర అంశాలపైన కూలంకుశంగా చర్చిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కెనాల్ బోటింగ్‌లో భాగంగా కెనాల్ బండ్‌లను కూడా ఆధునీకరించాలని చూస్తున్నారు. కట్టల మీద దెబ్బతిన్న ప్రాంతాలకు మరమ్మతులు చేయనున్నారు. వీటిపై పచ్చదనాన్ని పెంపొందించనున్నారు. విఎంసి కార్యాలయం, తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద బోట్ ఎరైవల్ పాయింట్లను ఏర్పాటు చేసేందుకు విఎంసి అధికారులు ప్రాథమికంగా ఓ అంచనాకు వచ్చారు. ఆ మేరకు

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే ఈ బోటింగ్ ప్రాజెక్టు ఇరిగేషన్ శాఖ అధికారుల నుంచి ఆమోదం పొందాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రాజెక్టు గురించి ఇదివరకే జలవనరుల శాఖ అధికారులతో చర్చించినట్లు తెలిసింది. బోటింగ్ సర్వీసు ప్రారంభించడానికి మూడు కాల్వల్లో తగినంత నీరు ఉంది. నీటిపారుదల శాఖ నుంచి అనుమతి వస్తే పర్యాటక శాఖ సహకారంతో బోటింగ్ ఏర్పాటు చేస్తామని, ఇది విజయవంతమైతే, భవిష్యత్తులో బోట్‌లోనే ఈట్ స్ట్రీట్‌కు కూడా ప్లాన్ చేయనున్నట్లు విఎంసి అధికారులు చెబుతున్నారు. మరో వైపు రూ.78 లక్షలతో గతంలోనే కాల్వల శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. వంతెనలపై ఇనుప కంచెను ఏర్పాటు చేసి చెత్తను కాల్వల్లో పారవేయకుండా చర్యలు చేపట్టారు. మూడు కాల్వల్లో సుమారు 600 టన్నుల వరకు చెత్తను తొలగించారు. దీని కోసం ప్రత్యేకంగా మూడు బోట్లను కూడా అందుబాటులోకి తెచ్చారు.

# దసరా ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

## కలెక్టర్ డిల్లీరావు, సిపి కాంతిరాణా ఆదేశం

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డిల్లీరావు, సిపి కాంతిరాణా

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో దుర్గమ్మ దర్శనానికి తరలివచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు, జిల్లా పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా అధికారులను ఆదేశించారు. క్యూలైన్‌ల్లో సందర్శకుల సౌకర్యార్థం టోల్‌గేట్ సమీపంలో రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని కోరారు. టోల్‌గేట్ సమీపంలో క్యూలైన్లలో సందర్శకుల సౌకర్యార్థం రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలను శనివారం కలెక్టర్ ఎస్ డిల్లీరావు, సిపి కాంతి రాణా టాటా... దేవాలయ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గతంలో కెనాల్ రోడ్డులోని వినాయక గుడి వద్ద నుండి సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు, మోడల్ గెస్ట్ హౌస్ ఎదురుగా కొండ పక్క నుండి టోల్‌గేట్ మీదగా ఇంద్రకీలాద్రి పైకి సందర్శకులు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇటీవల కొండ చరియలు విరిగిపడుతున్న నేపథ్యంలో క్యూలైన్‌లను మోడల్ గెస్ట్ హౌస్ వద్ద ఎడమ వైపు కు మళ్లించి ఫ్లై ఓవర్ కింద నుండి ఫుట్ ఓవర్ బ్రిడ్జి పైనుండి ఘాట్ రోడ్డు మీదగా కొండపైకి చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే కుమ్మరిపాలెం నుండి కొండపైకి చేరుకునే క్యూలైన్లను కూడా టోల్ గేట్ వద్ద కూడి వైపుకు మళ్లించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి పైనుండి ఘాట్ రోడ్డు మీదగా క్యూలైన్‌లో కొండపైకి చేరుకునేలా రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిల కింద నుండి కేవలం అత్యావసర వాహనాలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపులను మాత్రమే అనుమతించాలని, మిగిలిన వాహనాలు ఫ్లై ఓవర్ మీదగా కుమ్మరిపాలెం వైపు నుండి గాలి గోపురం ఘాట్ రోడ్డు మీదగా కొండ పైకి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దుర్గాఘట్, పున్నమిఘట్, భవానీ ఘాట్లలో సందర్శకులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సిపి తెలిపారు. దేవాలయ అధికారులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో దసరా మహోత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్, సిపి కోరారు. ఏర్పాట్ల పరిశీలనలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ విశాల్‌గున్ని, అడిషనల్ డిసిపి ప్రసాద్, ఎసిపిలు హనుమంతరావు, రామచంద్రరావు, సిఐలు సురేష్‌రెడ్డి, సుధాకర్, రామచంద్రరావు, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి. భ్రమరాంబ, ఎగ్జిక్యూటివ్ ఇం.ఇనీర్లు ఎల్ రమ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విజయవాడలో జరిగిన ఆశా వర్కర్ల నిరసనలో కమల తదితరులు

# ఆశాలపై వత్తిడి దుర్మార్గం

## జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల

వార్త 6లో

## బాలికను వేధించిన వ్యక్తికి జైలు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** మచిలీపట్నం ఫోక్సో కోర్టులో జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్ కేసులో క్రైమ్ నెం.96/2016 యు / ఎస్ 341, 354, 354 డి, 509 ఐ పి సి, సెక్షన్ 12 పోక్సో యాక్ట్ కేసులో ముద్దాయి జగ్గయ్యపేట పట్టణం సీతారాంపురానికి చెందిన లావూరి నాగరాజు మైనర్ బాలిక కాలేజీకి వెళ్తున్న సమయంలో ఆ బాలిక పట్ల అసభ్యకరంగానూ, వేధింపు గురి చేసినట్లు మైనర్ బాలిక జగ్గయ్యపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి అనంతరం విచారణ చేసి మచిలీపట్నంలో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. తదుపరి సెక్షన్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మంజులూరు వెంకట మహేష్ ఏడుగురు సాక్షులను విచారించారు. తదుపరి మచిలీపట్నం ఫోక్సోకోర్టు జడ్జీ డాక్టర్ షేక్ మహమ్మద్ ఫజాలుల్ల నిందితుడు లావూరి నాగరాజుపై నేరం రుజువు కావడంతో రెండు సంవత్సరాలు జైలు శిక్ష, ఐదువేల రూపాయలు జరిమానా విధించారు.

## సైబర్ సెక్యూరిటీ - టూల్స్‌పై శిక్షణ

**ప్రజాశక్తి మైలవరం :** స్థానిక లకిరెడ్డి బాలి రెడ్డి ఇంజ నీరింగ్ కళా శాలలో ఇన్ఫ ర్మేషన్ టెక్నాలజీ తతీయ సంవ త్సరం విద్యా ర్థులకు సైబర్ సెక్యూరిటీ - టూల్స్ అనే అంశంపై శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిసిఎల్ కంపెనీకి చెందిన సెక్యూరిటీ ఎనలిస్ట్ శ్రీవాత్సవ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరిగే సైబర్ క్రైమ్స్, హాకింగ్‌ని ఎలా అడ్డుకోవాలనే అంశాలపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మొబైల్‌లు, ల్యాప్‌టాప్‌లు, డెస్కటాప్‌లు, ఇంటర్నెట్ వంటి పెరిఫెరల్ సైబర్ బెదిరింపులకు మరింత ప్రేరేపిస్తుంది. ఈ విషయంపై ప్రతి పౌరునికి అవగాహన తప్పనిసరి అన్నారు. విద్యార్థులకు సాంకేతిక రంగంలో విస్తత పరిశోధన అంశంగా వున్న ఈ టెక్నాలిజీని క్షుణ్ణంగా వివరించారు.

ఎమ్మెల్సీ అరుణ్ ని కలిసిన ఎన్‌సిసి సభ్యులు

## ఎంఎల్‌సి అరుణ్‌ను కలిసిన ఎన్‌సిసి సభ్యులు

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ పట్టణంలోని స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో కష్ణా జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్‌ను నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ వీరలపాడు మండల అధ్యక్షులు మందా జయరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల వీరులపాడు మండలం ఎన్‌సిసి కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. మండలంలోని క్రైస్తవులందరికీ చర్చిలన్నిటికీ అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి యేసు రత్నం, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జార్జి ముల్లర్, రీజనల్ చైర్మన్ రెవ పాల్ శంకర రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు రెవ హానోకు తదితరులు పాల్గొన్నారు.

## పాస్‌పోర్ట్ రిజిస్ట్రేషన్ మేళాకు స్పందన

**ప్రజాశక్తి మైలవరం :** స్థానిక లక్కిరెడ్డి అనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన ఉచిత పాస్పోర్ట్ రిజిస్ట్రేషన్ మేళాకు విశేష స్పందన లభించింది. 162 మంది ఉచితంగా పాస్పోర్ట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. లియో గ్లోబల్ ఓవర్సీస్ విజయవాడ మేనేజర్ అప్పయ్య చౌదరి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇ.రవి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంకా ఎవరైనా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ఎస్ఎస్సి సర్టిఫికెట్ జిరాక్స్ ఆధార్ కార్డు తెచ్చుకోవాలని సూచించారు. వివరాల కోసం7809955599 నంబర్లు సంప్రదించాలని కోరారు.

## వినాయక నిమజ్జనం

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని 16వ వార్డు చెరువు బజార్‌లో ఉప్పుతళ్ళ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుని విగ్రహం నిమజ్జనోత్సవ కార్య క్రమంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. నిమజ్జనాన్ని బయలు దేరుతున్న గణనాధుని విగ్రహానికి కొబ్బరికాయ కొట్టి నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని టీడీపీ జాతీయ కోశాధికారి, మాజీ శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్, సోదరులు శ్రీరాం చిన్నబాబు ప్రారంభించారు.

# సోషల్ మీడియాను అభివృద్ధికి ఉపయోగించుకోవాలి

ఉత్తమ విద్యార్థులకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి - నందిగామ :** విద్యార్థులు సోషల్ మీడియా సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ అభివృద్ధి కోసం వినియోగించుకోవాలని వక్తలు పేర్కొన్నారు. హేలాపురి లయన్స్ క్లబ్, దివ్యశ్రీ లేళ్ళ సత్యనారాయణ స్మారక ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కోనాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అను అంశంపై శనివారం అవగాహన కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.వి.ఎల్.నారాయణ అధ్యక్షతన జరిగింది. ప్రధానవక్త, సీనియర్ న్యాయవాది & ట్రైనర్ కూన కష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ అధీకత వెబ్‌సైట్స్‌ను మాత్రమే చూసి తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. నిషేధించబడిన అసభ్యకరమైన లింకులను ఓపెన్ చేయవద్దని కోరారు. విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్ ఎల్.వెంకటేశ్వరరావు సహకారంతో పాఠశాల ఉత్తమ విద్యార్థి కుమారి యరగర్ల కార్తీక, ఉత్తమ గ్రంథాలయ పాఠక విద్యార్థి కుమారి గుడారు ఆశా లక్ష్మిలకు తగిన పారితోషికం, ప్రశంసాపత్రం, శంకరనారాయణ నిఘంటువులను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, విశ్రాంత ఉద్యోగి టి.హుస్సేన్, ఉపాధ్యాయులు, జయశ్రీ, లీలారాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

## సమస్యలపై ఉద్యోగుల వినతి

**పెనుగంచిప్రోలు:** పాఠశాల విద్య సమగ్ర శిక్ష అభియాన్ సొసైటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, వేతనాలు పెంచాలని కోరుతూ శనివారం మండల విద్యాశాఖ కార్యాలయంలో విద్యాశాఖాధికారి రవీంద్ర నాయక్‌కు కాంట్రాక్ట్ ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ సొసైటీలో వివిధ విభాగాల్లో గడిచిన 10 నుండి 15 సంవత్సరాల పైగా కాంట్రాక్టు ఉద్యోగులు పని చేస్తున్నారని కానీ పనికి తగ్గ వేతనాలు రావటం లేదని, గడిచిన ఐదు మాసాల నుండి జీతాలివ్వడం లేదని, కుటుంబాలు జీవనం కష్ట తరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపిక కాబడిన మేము డిగ్రీ, పిజి, బి యిడి పూర్తి చేసి కాంట్రాక్టు ఉద్యోగులుగా పని చేస్తున్న, విద్యా శాఖ కార్యాలయం ద్వారా అనేక పనులు చేస్తున్నామని కానీ ప్రభుత్వం మా సేవలను గుర్తించడం లేదని, సకాలంలో జీతాలు అందించకపోతే మా కుటుంబాలు పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి మా కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ పి లు గోపాలరావు, శేష గిరి, చందు తదితరులు పాల్గొన్నారు.

## 'బొబ్బర'తో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**ప్రజాశక్తి - ఎ.కొండూరు :** మండలంలో బొబ్బర తెగులుతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మండల రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎ.కొండూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట బాధిత రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి ఆళ్ళ అమ్మి రెడ్డి మాట్లాడుతూ ఎకరానికి లక్ష రూపాయలు నష్ట పరిహారం ఇచ్చి రైతుల్ని ఆదు కోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ ఉన్నం ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు నాయకులు పి.ఆనందరావు, నాయకులు రావుల రామకష్ణ, బి.శ్రీను, రైతులు ఎం.లక్ష్మణ్, యోహాను, కావూరి రాములు, తాళ్లూరి తిరపతిరావు, బాధిత రైతులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న దశ్యం

## 10న భవన నిర్మాణ కార్మికుల ధర్నా

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 10వ తేదీన ధర్నాచౌక్‌లో జరుగనున్న ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ బెంజిసర్కిల్ వద్ద గల కార్మికుల అడ్డా వద్ద నిరసన కార్యక్రమం శనివారం జరిగింది. సిఐటియు విజయవాడ తూర్పు సిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో కార్మికులకు కరపత్రాలను అందచేసి ధర్నా కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా కోరారు. ఈసందర్భంగా సిఐటియు నాయకులు బెనర్జీ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు ఒకప్రక్క పనిలేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో విజయవాడ తూర్పు నగర అధ్యక్షులు వి.బి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

# టార్చిలైట్లతో టిడిపి నిరసన

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట:** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు 'బాబుకు తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం రిలే నిరాహార దీక్షలు' కార్యక్రమంలో భాగంగా 29 రోజులుగా జగ్గయ్యపేట పట్టణంలో జరుగుతున్న నిరాహార దీక్ష శిబిరంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు అధ్యక్షతన జగ్గయ్యపేట న్యాయవాదులు, టిడిపి నాయకులు కూర్చున్నారు. వారికి సంఘీభావంగా గ్రామ, పట్టణ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామ పట్టణంలోని రైతుపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రిలే నిరాహార దీక్ష 25వ రోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. **కంచికచర్ల :** స్కిల్ స్కాం కేసులో టిడిపి అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును నిరశిస్తూ టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు కంచికచర్ల మండలంలో శనివారం రాత్రి లైట్లు ఆపి టార్చిలైట్ల వెలుగులో నిరసన తెలిపారు. చంద్రబాబు అరెస్టు ను ఖండిస్తూ కాంతిలో క్రాంతి పేరుతో కార్యక్రమం నిర్వహించాలని టిడిపి అధిష్టానం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా శనివారం రాత్రి 7 గంటల నుండి 5 నిమిషాలు పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో టిడిపి నాయకులు కార్యకర్తలు ఇళ్ళల్లో లైట్లు ఆఫ్ చేసి, ఆరుబయట టార్చిలైట్ల వెలుగులో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, నాయకులు లక్ష్మణరావు, గుత్తా రత్నం, అన్నదాత కష్ణ, వేమా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. నక్కలంపేటలో, ఆత్కూరులో నిరసన కార్యక్రమం చేశారు. **జగ్గయ్యపేట :** మండలంలోని గౌరవరం గ్రామం లైట్లు ఆపి సెల్ ఫోన్ లైట్లు, లాంతర్‌తో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. **వన్‌టౌన్:** ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న ఆధ్వర్యంలో ఆయన కార్యాలయం వద్ద శనివారం కాంతిలో క్రాంతి కార్యక్రమంలో భాగంగా విద్యుత్ లైట్లు ఆపివేసి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. 42వ డివిజన్‌లో...పార్టీ కార్యకర్తలు నాయకులు స్థానిక ప్రజలు దీపాలంకరణ మరియు మొబైల్ లైట్స్ ఆన్ చేసి ప్రదర్శన చేశారు. **విజయవాడ అర్బన్ :** అశోక్‌నగర్, అయ్యప్ప నగర్‌లోని పురవీధుల్లో కాగడాలు, కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. గద్దె అనూరాధ పాల్గొన్నారు.

వన్‌టౌన్‌లో...

# ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన సేవలు

**ప్రజాశక్తి - కంచికచర్ల :** కంచికచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో మోడల్ కాలనీలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం సలహాలు ఇచ్చారు. ఎంపిడిఒ కె.బాల శంకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శంకరబాబు, సర్పంచ్ వేల్పుల సునీత, జడ్పీటీసీ పాల్గొన్నారు. **వత్సవాయి :** మండలంలోని ఖమ్మంపాడులో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచి బేతపూడి పున్నమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి ఎస్.పోగుదేవమని, ఎంపిపి కొలుసు రమాదేవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు నరాల మధుసూదన్ రెడ్డి, నరాల వెంకటరెడ్డి, సొసైటీ అధ్యక్షులు నారాయణరెడ్డి ఏసుపోగు శ్రీనివాసరావు వైద్యాధికారిణి సుష్మ తదితరులు పాల్గొన్నారు. **పెనుగంచిప్రోలు :** ముచ్చింతాల గ్రామంలోని ఎంపిపి స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ జక్కులూరి రాంబాబు తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కనకపూడి భాస్కర్‌రావు, మండల సచివాలయం కన్వీనర్ కన్నమాల శామ్యూల్, ఎంపిటిసి బేరోతుల నాగమణి, గ్రామ పార్టీ అధ్యక్షులు నూకవరపు శ్రీను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఇందిర, లక్ష్మి భార్గవి, శిద్దారెడ్డి, అంగన్వాడి సూపర్వైజర్ ఉషారాణి, సచివాలయం కన్వీనర్లు గోనెల శివ, కోలకాని జయరాజు, గ్రామ సోషల్ మీడియా కన్వీనర్ జక్కులూరి తిరుమలరావు, మండల ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ దేరంగుల శ్రీను, వైద్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామ మండలం రాఘవాపురం, ముప్పాళ్ళ గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలను నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు శనివారం ప్రారంభించారు. **గంపలగూడెం:** ఊటుకూరు, ప్రాథమిక వైద్యశాలల అధికారులు, ఇతర అధికారులు వైద్య సేవలు అందజేసినట్లు తెలిపారు. 10 రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు వైపిరెడ్డి వివరించారు. కొత్తపల్లిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షాలో 233 మంది వైద్యసేవలను వినియోగించుకున్నట్లు స్థానిక ఎంపీడీవో వైపీ రెడ్డి తెలిపారు. **వీరులపాడు** మండలంలోని- దొడ్డదేవర పాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలను డాక్టర్ మొండితోక జగన్ మోహన్ సందర్శించారు. గ్రామాల్లో ప్రజలు గతంలో వైద్య పరీక్షల కోసం ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సి వచ్చేదని.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని.. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారని ఎంఎల్‌ఎ అన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైద్యారోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు


కంచికచర్లలో

# విధులు బహిష్కరించి ఆశావర్కర్ల నిరసన

మచిలీపట్నంలో...

**ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ :** గుంటూరు జిల్లా తాడేపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో శుక్రవారం ఆశ వర్కర్ రేపూడి కృపమ్మ ఆకస్మిక మరణానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని కోరుతూ శనివారం మచిలీపట్నం వర్రెగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నుండి విధులు బహిష్కరించారు. ఆశా వర్కర్ రేపూరి కపమ్మకు న్యాయం జరగాలని నినదించారు. ఈ కార్యక్రమంలో కష్ణా జిల్లా సిఐటియు కోశాధికారి బూర.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశా వర్కర్లపై పని భారం పెంచుతూ, అనేక రకాలైన యాప్లు ఇస్తూ వాటిని రికార్డు పూర్వకంగా పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తూ, వేధిస్తూ పనిభారం వేయటం జరిగిందని అన్నారు. ఈ పని ఒత్తిడికి గురై అనేకమంది రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు హార్ట్ ఎటాక్ తో మరణించడం జరుగుతుందని అన్నారు. ఈ పని భారమును తగ్గించమని అనేకసార్లు ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్ర మంలో సిఐటియు మచిలీపట్నం మండల కార్యదర్శి సిహెచ్ జయరావు, మచిలీపట్నం ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు బి కిరణ్మయి కార్యదర్శి కాసిమ్మ తదితర ఆశ వర్కర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** చిన్న ఓగిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశ వర్కర్లు ధర్నా నిర్వహించారు. చిన ఓగిరాల ఆశ వర్కర్స్ కార్యదర్శి కొడాలి స్వర్ణలత మాట్లాడుతూ కృపమ్మ కుటుంబానికి సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి బాలగంగాధర్ మాట్లా డుతూ మెడికల్ క్యాంపులో కూడా సరైన మెడిసిన్స్ అందుబాటులో లేకపోవడం శోచనీయమని గుండెపోటు కు గురైన మనిషికి కనీసం ఆస్ప్రిన్ టాబ్లెట్స్ కూడా లేవని ఆరోగ్య సురక్ష లో పని చేస్తున్న మెడికల్ సిబ్బందికే రక్షణ లేకపోతే మిగిలిన వారిని ఏం కాపాడతారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బేబీ భారతి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. **పెనమలూరు :** కంకిపాడు మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఉప్పులూరు పిహెచ్‌సి పరిధిలోని ఆశ వర్కర్లు కలిసి మానవహారంగా ఏర్పడి కపమ్మ మృతికి సంతాపం తెలిపారు. అనంతరం ఆశా వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు గుర్రం చిట్టి కుమారి మాట్లాడుతూ చనిపోయిన కపమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఆమె కుటుంబానికి ఇల్లు, ఇళ్ళ స్థలం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో సిఐటియు కంకిపాడు మండల అధ్యక్ష కార్యదర్శులు మద్దాల.రజిని, తాడంకి నరేష్ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్. సంధ్య, వి.పార్వతి, అనితలతోపాటు పిహెచ్‌సి పరిధిలోని ఆశలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** మండల పరిధిలో ఉన్న ఆశ వర్కర్లంతా శనివారం తమ విధులు బహిష్కరించి పీహెచ్సీ ఎదుట ధర్నా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలోపలువురు ఆశలు పాల్గొన్నారు.

కంకిపాడులో...

తోట్లవల్లూరులో...

ఉయ్యూరులో...

# 25వ రోజుకు దీక్షలు

**ప్రజాశక్తి-గుడివాడ :** టిడిపి నాయకుడు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 25వ రోజు వినూత్నంగా ఒంటి కాలుపై నిలచి నిరసన తెలిపారు. ఈ దీక్షలను టిడిపి పట్టణ, రూరల్, నందివాడ మండల అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, దానేటి సన్మాసిరావులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకలు పొట్లూరి వెంకటకృష్ణారావు, షేక్ జానీ షరీఫ్, అర్నేపల్లి పాండు, తేనేల ఏడుకొండలు, మాదల సురేష్, పొట్లూరి వెంకటేశ్వరరావు, దారపురెడ్డి శేషు తదితరులు పాల్గొన్నారు.

**వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో కాంతితో క్రాంతి**

తెలుగుదేశం పార్టీ నాయకులు వెనిగండ్ల రాము ఆద్వర్యంలో బైపాస్ రోడ్డు కార్యాలయం వద్ద బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా కాంతితో క్రాంతి అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కాంతితో క్రాంతి కార్యక్రమంలో భాగంగా కార్యాలయం లైట్లు ఆర్పివేసి కొవ్వొత్తుల వెలుగులో నిరసనలు తెలియజేశారు. సైకో పోవాలి సైకిల్ రావాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కుంచంపల్లి సుబ్రహ్మణ్యం, మిక్కిలినేని రమేష్, లింగ చిట్టిబాబు, వడ్డాది నాగరాజు , గుడివాడ జోన్స్ దయానందం, వూకోటి శివాజీ, గొర్రె ముచ్చు వెంకట నరసింహారావు, తుమేటి శ్రీనివాస్, సూరపరెడ్డి ప్రసాద్, సూరపనేని శ్రీనివాస్, మెరుగు మోజేష్, కాగిత శివశంకర్, శంకరంపాడు, తుమ్మలపల్లి సర్పంచ్ లు కైలే సుబ్బారావు, రాధాకష్ణ, రామపురం మాజీ సర్పంచ్ అందుగుల ఏసుపాదం, తెలుగు మహిళా నాయకురాళ్లు సిరి పురుపు తులసి రాణి పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయం వద్ద కాంతితో క్రాంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సెల్‌ఫోన్ లైట్లుతో కొవ్వొత్తులు వెలిగించి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసన తెలిపారు. టిడిపి పట్టణా, రూరల్ మండలల అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకవరపు సునీల్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :**



గుడివాడలో...

అవనిగడ్డలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు 25వ రోజుకు చేరుకున్నాయి. శనివారం దీక్షల్లో రామచంద్రపురం వల్లంధ పాలెం దక్షిణ చిరు ఓలు లంక గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు మహిళా కార్యకర్తలు దీక్షలో పాల్గొన్నారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పిం చి దీక్షలను ప్రారంభించార,ు అనంతరం సాయంత్రం ఐదు గంటలకు బుద్ధ ప్రసాద్ సతీమణి మండల విజయలక్ష్మి నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింప చేశారు. జిన్నా బత్తుల అన్నమ్మ, అద్దంకి నారాయణ, బచ్చు పూర్ణ చంద్రరావు, బచ్చు ప్రభాకర్‌రావు, బచ్చు పున్నయ్య, పాల్గొన్నారు

**బెలూన్లతో నిరసన**

చంద్రబాబునాయుడు అరెస్టును వ్యతిరేకిస్తూ మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ సతీమణి మండ లి విజయలక్ష్మి ఆధ్వర్యంలో నల్ల బెలూన్లతో నిరసన తెలిపారు. శనివారం అవనిగడ్డ రాజీవ్ సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, నిండు లక్ష్మణరావు, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు బండి కనకదుర్గ, కొల్లూరి శాలిని, జిన్నా బత్తుల అన్నమ్మ, అద్దంకి నారాయణ, బచ్చు రఘునాథ్, ఘంటసాల రాజమోహన్రావు పాల్గొన్నారు. అలాగే క్రాంతిలో కాంతి కార్యక్రమంలో భాగంగా శనివారం పార్టీ కార్యాలయం వద్ద వినూత్న నిరసన తెలిపారు. సాయంత్రం ఏడు గంటలకు లైట్లన్నీ ఆర్పి వేసి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** చంద్రబాబు రిమాండ్కు నిరసనగా కాటూరులో రిలే దీక్షాశిబిరాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సందర్శించి సంఘీభావం తెలిపారు. సత్యనారాయణ, సుందరయ్య, కోటేశ్వరరావుతో పాటు పలువురు దీక్షలో పాల్గొనగా పార్టీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, మాజీ అధ్యక్షుడు వేమూరు శ్రీనివాసరావు, మండల కార్యదర్శి కాటూరు శరత్, యుగబాబు, వెంకటనారాయణ తదితరులు సంఘీభావం తెలియజేశారు. **ప్రజాశక్తి ఘంటసాల :** కాంతితో క్రాంతి కార్యక్రమంలో బాగంగా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు ఆధ్వర్యంలో కొడాలిలో, గుత్తికొండ వరప్రసాద్ ఆధ్వర్యంలో చిట్టూర్పులో, యార్లగడ్డ వీరభద్రరావు ఆధ్వర్యంలో తాడేపల్లిలో, తాడికొండ చిన్న ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో, అయినపూడి భాను ప్రకాష్ ఆధ్వర్యంలో ఘంటసాలలో, పరిసె చలపతి, దిరిశం వెంకట్రావు, గువ్వాబత్తిన నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో లంకపల్లిలో, వేమూరి సాయి వెంకట రమణ ఆధ్వర్యంలో ఘంటసాల పాలెంలో కొవ్వొత్తులు వెలిగించి, బైక్ లైట్లు వేసి నిరసన తెలియజేశారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** మండల పరిధిలోని చాగంటిపాడు గ్రామ టిడిపి ఆధ్వర్యంలో కాంతితో క్రాంతిమట్ట నిర్వహించారు. అమత బాబు, బసిరెడ్డి, శివుడు నాగేశ్వరరావు తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్ :** బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ సెంటర్లో మండల అధ్యక్షుడు దయ్యాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు బాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ శనివారం రాత్రి కాంతి తో క్రాంతి కార్యక్రమం ప్రజలతో కలిసి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. వీరవల్లిలో గ్రామ కమిటీ అధ్వర్యంలో లంక సురేంద్ర మోహనబెనర్జీ, గుండపనేని ఉమావరప్రసాద్, మంచాది రవీంద్ర, ఎంపీటీసీ సూర్యనారాయణ, ఉపసర్పంచ్ అజయ్ తదితరులు పాల్గొన్నారు. ఆరుగొలనులో గ్రామ కమిటీ ఆధ్యక్షుడు బేతా శేషుకుమార్, 87ఏళ్ల మూల్పూరి వెంకటరత్నం రహదారిపై నిర్వహించారు. రేమల్లె తెలుగుయువత, గ్రామకమిటీ ఆధ్వర్యంలో కాంతితో క్రాంతి కార్యక్రమంలో తెలుగుయ వత అధ్యక్షుడు కలపాల సూర్యనారాయణ, యనమదల శ్రీనివాసరావ, గుడివాడ విజయానంద్, రాధాకష్ణతోపాటు చిన్నారుల్లో పాల్గొన్నారు. **ప్రజాశక్తి పెదపారుపూడి** పెదపారుపూడి ,ఎలమర్రు, చినపారుపూడి ,దోసపాడు ,వెంట్రుప్రగడ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మండల టిడిపి అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి( చంటి ) ,ప్రధాన కార్యదర్శి మసి ముక్కు రాంబాబు, కూచిపూడి సుబ్బయ్య ,గుండపునేని శ్రీనివాసరావు (స్వామి), కలపాల కిషోర్, దగాని లెనిన్, జమీ బాబు పాల్గొన్నారు.

## చికిత్సపొందుతున్న వ్యక్తి మృతి

మిలేష్ (ఫైల్)

**ప్రజాశక్తి-బంటుమిల్లి :** రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడి మృతిచెందిన సంఘటన బంటుమిల్లి మండలంలో జరిగింది. వివరాల ప్రకారం గత నెల 25వ తేదీ రాత్రి పది గంటల సమయంలో మిలేష్ అనే యువకుడు రొయ్యల కంపెనీలో పని ముగించుకుని ఇంటికి వస్తున్న సమయంలో పెందూరు వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే విజయవాడలోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు.

## టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి : ఇద్దరికి గాయాలు

**ప్రజాశక్తి - భవానీపురం :** భవానీపురం జోజినగర్, చర్చి సెంటర్లో గల ఓ చికెన్ పకోడి తయారుచేసే షాపులోకి ఇసుక టిప్పర్ దూసుకెళ్ళింది. దీంతో అక్కడ నిలబడిన ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సితార సెంటర్ నుండి గొల్లపూడి వై జంక్షన్ వైపుకు వెళ్తున్న ఇసుక టిప్పర్ శనివారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో బైపాస్ రోడ్డులోని చర్చి సెంటర్ వద్ద గల చికెన్ పకోడి బండిపైకి దూసుకువెళ్ళింది. జోజినగర్ చర్చ్ సెంటర్లో ఖాజా చికెన్ పకోడీ బండి పైకి టిప్పర్ దూసుకెళ్ళటంతో పక్కనే నిలబడి వున్న గుణదలకు చెందిన బత్తుల గండయ్య (60) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న భవానీపురం సిఐ సలాం, వెస్ట్ ట్రాఫిక్ ఏసిపి రామచంద్రరావు, సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు, చికెన్ పకోడీ షాపులో గ్యాస్ బండ నుండి భారీగా మంటలు చెలరేగాయి. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. మృతిచెందిన వ్యక్తిని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## టిడిపి కార్యకర్తపై దాడి

**ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్ :** టీడీపీ కార్యకర్త చితకబాదటంతో పాటు ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు రివర్సై కేసు పెట్టిన ఘటన బాపులపాడులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బాపులపాడు తారకరామా కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త గాలి సంగ్రమం శుక్రవారం యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో పుటపల్లిలో నిర్వహించిన నిరసన ర్యాలీలో పాల్గొని తిరిగి వస్తుండగా ఎమ్మెల్యే వంశీ ముఖ్యఅనుచరుడైన పోతుమర్తి హేమంత్ వాగ్వివాదానికి దిగె చితకబాదాడని గాలి సంగ్రమం తెలిపారు. బాపులపాడులోని గంగానమ్మతల్లి దేవాలయం ఎదురుగా రహదారిపై తనతో వాగ్వివాదానికి దిగి నీ అం తు చూస్తానని బెదిరించడంతో పాటు ప్రక్కనే గల పంచాయితీ ట్యాప్ గల ఇనుపరాడ్తో చితకబాదాడని తెలిపారు. పోలీసులకు ఫోన్ చేసి విర్యాదు చేసినా స్పందన లేదన్నారు. గాయపడ్డ తనని పోలిస్ స్టేషన్ కు తీసుకెళ్లగా నొప్పి తట్టుకోలేక పోతున్నానని చెప్పినా వినకుండా పోలీస్ స్టేషన్లో గంటలపాటు ఉంచారని బాధితుడు సంగ్రమం తెలిపారు. దీనిపై హనుమాన్ జంక్షన్ ఎస్సై జనార్ధన్ ను వివరణ కోరగా ఇరువురి పిర్యాదులు తీసుకున్నామని కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. క్షతగాత్రుని తెలుగు మహిళ రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి, టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, తదితరులు. పరామర్శించారు.

# నత్తనడకన డ్రెయినేజీ పనులు

రాకపోకలు నిలిచిపోయిన రోడ్డు

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ – రామన్నపేట రహదారి విస్తరణ పనులు గత ఆరు నెలల నుంచి మొక్కుబడిగా జరుగుతున్నాయి. జిల్లా కోర్టు వద్ద డ్రెనేజీ నిర్మాణ పనులు మొదలై నెల రోజులైనా పూర్తి కాకపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. డ్రైనేజీ కల్వర్టు నిర్మాణం వల్ల నందిగామ – రామన్నపేట ప్రధాని రహదారిపై రాకపోకలు నిలుపుదల చేశారు. ఈ ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు ప్రయాణం చేస్తున్నాయి. కృష్ణా జిల్లాతో పాటు కృష్ణానది అవతల ఉన్న గుంటూరు జిల్లా వాసులు కూడా ప్రయాణిస్తుంటారు. జిల్లా కోర్టు వద్ద రహదారి అడ్డంగా ఉన్న డ్రైనేజీపై రూ.7 లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మాణం చేపట్టడంతో రాకపోకలు నిలిపి వేశారు. కల్వర్టు నిర్మాణంపై పనులు పూర్తి కాకపోవడంతో నెల రోజుల నుండి వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రామన్నపేట రోడ్డు నుండి నెహ్రూ నగర్ పక్క రోడ్డు ట్రాఫిక్ డైవర్ట్ చేయడంతో ఇరుకు రోడ్లలో వాహనాలు రాకపోకలు సాగించడం ప్రయాణికులకు గగనంగా మారింది. ఆటోలు, కార్లు, ఇసుక బండ్లు, మోటారు వాహనాలు ఇరుకు రోడ్డుపై అతికష్టం మీద వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడింది. స్కూల్ బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్కూల్ పిల్లలను బస్సు ఎక్కించటానికి గాంధీ సెంటర్, పాత బైపాస్ రోడ్డు వరకు వెళ్లి ఎక్కించవలసి వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇరుకు రహదారిపై వాహనాలు తిరగటం వల్ల ట్రాఫిక్కు సమస్య జటిలమైంది. సుమారు నెల రోజుల నుండి ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కోర్టు వద్ద అరకొరగా సాగే వ్యాపారాలు రోడ్డు విస్తరణ పనుల వల్ల స్తంభించిపోవటంతో వ్యాపారులు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయారు. షాపుల ముందు, గోడౌన్ల ముందు పొక్లెయిన్లు పెట్టి దబాయిస్తున్నారని వ్యాపారులు వాపోతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యము వల్ల పనులు ముందు కు సాగడం లేదని న్యాయవాదులు, స్థానికులు వాపోతున్నారు. జిల్లా కోర్టు వద్ద ఉన్న డ్రైనేజీ కల్వర్టు నిర్మాణం త్వరితముగా పూర్తి చేసి రాకపోకలు పునరుదించాలని ప్రజలు కోరుతున్నారు.

**ప్రజల బాధలు వర్ణనాతీతం... కాంసాని ఉదయ్ కుమార్, న్యాయవాది**

రామన్న పేట రహదారిపై రాకపోకలు నిలిపివేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నెహ్రూ నగర్ వైపు ట్రాఫిక్ డైవర్ట్ చేయడం వల్ల ఇరుకు రోడ్డులో వాహనాలు రాకపోకలకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల డ్రైనేజీ కల్వర్టు నిర్మాణ పనులు నత్త నడక సాగుతున్నాయి. నాలుగురోజుల క్రితం డ్రైనేజీపై తాత్కాలికంగా వాహనాలు రాకపోకలకు అనుమతులు ఇచ్చిన ప్రమాదాలు జరుగుతున్నాయని మరల రాకపోకలు నిలిపి వేశారు. తక్షణమే జిల్లా కోర్టు వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు.

**వారం రోజుల లలో పని పూర్తి చేస్తాం.. మున్సిపల్ ఎఇ ఫణి శ్రీనివాస రావు**

జిల్లా కోర్టు వద్ద డ్రైనేజీ కల్వర్టు నిర్మాణం పనులు వారం రోజుల లో పూర్తి చేస్తామని నందిగామ మున్సిపల్ ఎఇ ఫణి శ్రీనివాసరావు పేర్కొన్నారు. డ్రైనేజీ కల్వర్టు నిర్మాణం పూర్తి కావడానికి మెటీరియల్ ఆలస్యం అవుతుందని తెలిపారు.

**అప్రోచ్ పనులు మొదలు పెట్టాం... కమిషనర్ జయరాం**

జిల్లా కోర్టు వద్ద డ్రైనేజీ కల్వర్టు నిర్మాణం పూర్తి అయింది. కాంట్రాక్టర్ అప్రోచ్ పనులు చేపట్టవలసి వుంది. వారం రోజుల లో పనులు పూర్తి అవుతాయి.

**ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేస్తాం... ట్రాఫిక్ ఎస్ఐ సురేష్**

నందిగామ–రామన్నపేట రహదారిపై ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులను ఏర్పాటు చేశారు. రెండు మూడు రోజుల్లో ట్రాఫిక్ క్లియర్ చేస్తాం.

విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

## విద్యార్థులకు అభినందన

**విజయవాడ :** ఠాగూర్ స్మారక గ్రంథాలయం గవర్నర్ పేట, విజయవాడలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు సన్మానం జరిగినది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కష్ణాజిల్లా చైర్ పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన హైకోర్టు ఉద్యోగ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన కడియం శ్రీహరి విజయవాడ కోర్టులో జూనియర్ అసిస్టెంట్ గానూ కిల్లాడ పార్థ సారథి ఎస్ఎస్‌సి పోస్టల్ ఉద్యోగం పొందారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయాధికారిణి కె.రమా దేవి, సిబ్బంది కె.రాంబాబు, జే . శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన

**ప్రజాశక్తి - తిరువూరు :** తిరువూరు డివిజన్‌లోని మహిళా సంరక్షణ పోలీసులకు బాల్యవివాహ నిరోధక చట్టాలపై తిరువూరు షాదీ ఖానాలో ఐసిడిఎస్ సిడిపిఒ సత్యవతి అధ్యక్షతన అవగాహన సదస్సు శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బాలల హక్కుల సంరక్షణ కమీషన్ చైర్మన్ ఆదిలక్ష్మి, ఏపీపీ బడేమియాలు మేజరు కాకుండా బాలికలకు వివాహాలు చేయటం వలన అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. బాల్య వివాహాల నిర్మూలన చట్టం ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కావటం లేదని, జీఓ నెంబరు 31ని ప్రతిష్టంగా అమలు సేచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు మహిళా సంరక్షణ పోలీసులకు పుల్ అధికారులు కల్పించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల వేదిక సభ్యులు తిరుపతి రావు, ఫ్రాన్సిస్, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## ఆర్గనైజింగ్ సెక్రటరీగా పవన్‌కుమార్

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** శ్రీశైల క్షేత్ర భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వార్ల నగరాల కులస్తుల నిత్య అన్నదాన వసతి సత్రం అభివద్ధి కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఇద్దిపిల్లి పవన్‌కుమార్‌ను అన్న సత్రం కమిటీ ఫౌండర్ సెక్రెటరీ కెఎస్. జగన్ నియమించారు. ఈ సందర్భంగా జగన్‌ను అభివద్ధి కమిటీ సభ్యులు పోతిన వరప్రకాష్, బాయన శేఖర్ బాబు, బంక హనుమంతరావు, అడ్డూరి రాము, దుక్క కష్ణ, ఈది బాబురావు, సతల కష్ణ, పిళ్ళా సూరిబాబు తదితర కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా పోతిన వరప్రకాష్ మాట్లాడుతూ శ్రీశైలంలో నగరాల అన్న సత్రం నిర్మాణం చేయడం అనేది సాహసోపేతమైన నిర్ణయమన్నారు. దీనికి సహకరించిన మాజీ మంత్రి, పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావుకు అభినందనలు తెలియజేశారు.

## త్వరలో పేటకు ప్యాసింజర్ రైలు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** ఎంతోకాలంగా జగ్గయ్యపేట పట్టణ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న ప్యాసింజర్ రైలు చిరకాల వాంఛ త్వరలో తీరబోతుందని రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం జగ్గయ్యపేట పట్టణంలోని విద్యానగర్‌లోని రైల్వేవ్యాగన్ వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఉదయభాను మాట్లాడుతూ ప్యాసింజర్ రైలు తీసుకురావాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నుండి కేంద్ర రైల్వే శాఖ వారికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. ఇప్పటికే కేంద్ర రైల్వే శాఖ మంత్రి, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం అవ్వడం జరిగిందని, వారికి రూ.1200 కోట్ల రూపాయలతో డిపిఆర్ కూడా అందించినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న సామినేని ఉదయభాను

# నేతాజీ హైస్కూల్‌కు బెస్ట్ స్కూల్ అవార్డు

**ప్రజాశక్తి - భవానీపురం :** స్థానిక భవానీపురంలోని నేతాజీ హైస్కూల్‌కు బెస్ట్ స్కూల్ అవార్డు లభించింది. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గవర్నర్ పేట మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ ప్రతిభా పురస్కారాల మహోత్సవంను కె.వి.ఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు, ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెస్ట్ స్కూల్ అవార్డును కలెక్టర్ డిల్లీరావు చేతుల మీదుగా నేతాజీ హైస్కూల్ ప్రిన్సిపల్ కందుల అరుణకుమారి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు సత్కరించి, మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ టెక్నాలజీ ఎంత అభివద్ధి చెందినా టీచర్లు, బ్లాక్ బోర్డు ఉంటేనే సమాజంలో విలువలతో కూడిన విద్య అందించడం సాధ్యమవుతుందన్నారు. ఇలాంటి విద్య ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో చక్కగా రాణిస్తారని అన్నారు. నేతాజీ స్కూల్ ప్రిన్సిపాల్ కె.అరుణకుమారి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల తమ స్కూల్‌కు బెస్ట్ స్కూల్ అవార్డు లభించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, ఎంబివికె బాధ్యులు పి.మురళీకష్ణ, సేఫ్ ప్రెసిడెంట్ జి.జ్యోత్స్న, నేతాజీ హైస్కూల్ చైర్మన్ కందుల తిరుపతిరెడ్డి, కె.రాజేష్, కె.దినేష్, కె.మల్లికార్జున, కె.వెంకటేశ్వర్లు, టి.ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బెస్ట్ స్కూల్ అవార్డును అందుకున్న ప్రిన్సిపల్ అరుణ కుమారిని స్కూలు యాజమాన్యం, ఉపాధ్యాయ బందం, సిబ్బంది అభినందించారు.

బెస్ట్ స్కూల్ అవార్డును అందుకున్న ప్రిన్సిపల్ అరుణకుమారిని సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

చిరు వ్యాపారులకు నూడిల్స్ బండిని వితరణ చేస్తున్న వెలంపల్లి ఫౌండేషన్ సభ్యులు

## వెలంపల్లి ఫౌండేషన్ చేయూత

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** స్థానిక బ్రాహ్మణ వీధిలో గల పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు ఇంటివద్ద వెలంపల్లి శ్రీనివాసరావు అల్లుడైన మంచు కొండ చక్రవర్తి జన్మదినాన్ని పురస్కరించుకొని వెలంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 54 డివిజన్‌లో నివాసముండే సయ్యద్ మహమ్మద్ అలీకి జీవనోపాధి నిమిత్తం నూడిల్స్ బండిని, 55వ డివిజన్ లో నివాసం ఉండే జెన్ను జ్యోతికి టిఫిన్ బండిని, 56వ డివిజన్ లో నివాసం ఉండే కోలిగొట్ల రమణమ్మ కి వైద్య ఖర్చులు నిమిత్తం 20 వేల రూపాయల ఆర్థిక సహా యాన్ని వెలంపల్లి ఫౌండేషన్ సభ్యులైన వెలంపల్లి రాఘవ నర్సింహారావు, కొనకళ్ళ విద్యాధరరావు అందించారు.

# కృపమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

**ప్రజాశక్తి - మైలవరం :** గుంటూరు జిల్లా తాడేపల్లిలో ప్రభుత్వ ఒత్తిడి కారణంగా చనిపోయిన ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని శనివారం మండలంలోని చంద్రాల పిహెచ్‌సి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి సి హెచ్.సుధాకర్ మాట్లాడుతూ శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఆశ వర్కర్ల నాయకులను అర్ధరాత్రి పూట అరెస్టుచేయటం దారుణమన్నారు. చనిపోయిన ఆశ కార్యకర్తల కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ యూనియన్ జిల్లానాయకురాలు జ్యోతి మాట్లాడుతూ చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని జగనన్న సురక్ష పేరుతో ఆశ వర్కర్లపై మోపిన పని భారాన్ని తగ్గించాలని అధికారుల వేధింపులు, ఒత్తిళ్లు ఆపాలని ఆశ వర్కర్లకు చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ యూనియన్ కమిటీ సభ్యులు వెంకమ్మ, రాణి, కళ్యాణి, పార్వతి, నాగమణి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి, బూచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి షేక్ గౌస్ మియా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్ రామనాథం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. **ఎ.కొండూరు :** సిఐటియు ఆధ్వర్యంలో ఎ.కొండూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శనివారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బి. లక్ష్మీ వెంకటరమణ, శ్రావణి, దుర్గా, జ్యోతి, భారతి, శారద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **వీరులపాడు :** వీరులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంఎదుట ఆశ వర్కర్లు లు నిరసన కార్యక్రమం చేపట్టారు ఆశా వర్కర్లు చేపట్టిన నిరసన కార్యక్రమానికి సిఐటియు మండల కార్యదర్శి లాల్ అహ్మద్ గౌస్ సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ పిహెచ్‌సి నాయకురాలు ముద్దింబి అల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆశా వర్కర్ అధ్యక్షురాలు సుబ్బమ్మ కృష్ణవేణి సాయమ్మ భాగ్యలక్ష్మి మేఘన విజయ్ మేరీ అనూష కవిత కుసుమలత స్వర్ణకుమారి ఎన్.రాధా పి.వెంకటరమణ పాల్గొన్నారు. **పెనుగంచిప్రోలు :** అధికారుల వేధింపులకు గురయ్యి శుక్రవారం మతి చెందిన గుంటూరు జిల్లా తాడేపల్లి ఆశా కార్యకర్త కృపమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని మండల సిఐటియు కార్యదర్శి దారా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు జ్యోతి, శిరీష, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో

జగ్గయ్యపేటలో...

మైలవరంలో...

కేసుల సత్వర పరిష్కారానికి

## మీడియేషన్ కేంద్రాలను ఉపయోగించుకోవాలి

- కృష్ణాజిల్లా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ రామకృష్ణ

మాట్లాడుతున్న లోక్ అదాలత్ చైర్మన్ రామకృష్ణ

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** పెరిగిపోతున్న పెండింగ్ కేసులు పరిష్కారం కోసం జిల్లా న్యాయసవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ని కక్షిధారులు ఉపయోగించు కోవాలని కృష్ణాజిల్లా పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ రామకృష్ణ అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయ సేవా సదన్ లో ఏర్పాటు చేసిన న్యాయమూర్తులు న్యాయ వాదుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న కేసులు పరిష్కారం కోసం, డబ్బులు ఆదా, సమయం ఆదా కోసం మీడియేషన్ సెంటర్ ద్వారా కేసులు పరిష్కారం చేసుకోవాలని ఆయన సూచించారు. సత్వర కేసులపరిష్కారం వలన ఇరు పక్షాలకు శాంతియుత మార్గం చేకూరుతుందని ఆయన అన్నారు. కేసులు పరిష్కారం కోసం లోకాదాలత్ లు ప్రత్యామ్నాయ వేదికలు, మీడియా సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలియజేశారు. ఎటువంటి కేసు కైనా పరిష్కారం ఉంటుందని దాన్ని పరిష్కరించుకోవడంలో కక్షిదారులు ముందుకు రావాలని అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రామకష్ణయ్య మాట్లాడుతూ కష్ణాజిల్లాలో మధ్యవర్తిత్వ కేంద్రాలు కేసులు పరిష్కారం చేస్తున్నాయని తెలియజేశారు. సుప్రీంకోర్టు ట్రైనింగ్ పొందిన మీడియేటర్లు చేత కేసులు పరిష్కారం కోసం మచిలీపట్నం విజయవాడలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలియజేశారు. అన్ని సివిల్ కేసులు రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు ఈ మధ్యవర్తి కేంద్రాల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని ఆయన తెలియజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు తుంగల హరిబాబు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, పారా లీగల్

## సేవా కార్యక్రమాలతో స్ఫూర్తి

**ప్రజాశక్తి-గన్నవరం :** అచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకుడిగా ఎన్నో పోరాటాలు చేసి సమస్యలు పరిష్కారం చేసి ఒక ఉద్యమ నాయకుడుగా రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు పొంది నేడు సమాజానికి ఎన్నో అద్భుతమైన సేవలు అందిస్తున్న మాజీ ఎస్.ఎఫ్.ఐ మాజీ అధ్యక్షులు హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ తమకు స్ఫూర్తిగా నిలిచారని జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చిల్లర రాజేష్ అన్నారు. గన్నవరం మండలం దావాజిగూడెం లో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పందన మానసిక వికాస కేంద్రాన్ని శనివారం రాజేష్ సందర్శించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ వెంకట్ అతి చిన్న వయసులోనే హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ స్థాపించి అప్పటి నుండి ఈ సమాజానికి అద్భుతమైన సేవలను అందిస్తున్నారని రాజేష్ అన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు దివ్యాంగులకు, వద్ధులకు,విద్యార్థులకు వితంతువులకు అండగా ఉంటున్నారన్నారు.

## నేత్రాలు దానం

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** మండల పరిధిలోని వేకనూర్ గ్రామానికి చెందిన తుంగల సామ్రాజ్యం(80) మతి చెందడంతో ఆమె కళ్ళను దానం చేశారు. సామ్రాజ్యం కు ఇరువురు కుమారులు నలుగురు కుమార్తెలు ఉన్నారు.వారి సహకారంతో విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. డాక్టర్ ప్రవీణ్ కుమార్ నేత్రాలను సేకరించారు ఇప్పటికీ 187వ నేత్రదానమని డాక్టర్ తెలిపారు.

## మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

**ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ :** మచిలీపట్నం మండలం బొర్రపోతుపాలెం పంచాయతీ బైరాగిపాలెం బెరాకా మినిస్ట్రీస్ ఆడిటోరియంలో 40 మంది మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం రోటరీ వారి తో కలిసి 40 కుట్టు మిషన్లు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా కృష్ణా జిల్లా ఐసీడీఎస్ పీడీ సువర్ణ కుమారి పాల్గొని మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమం కొరకు ప్రభుత్వంతో పాటు బెరాకా మినిస్ట్రీస్ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను కొనియాడారు. ఈ స్వయం ఉపాధి కొరకు ఉచితంగా పంపిణీ చేయబడిన కుట్టు మిషన్లు తమ ఉపాధి కొరకు ఉయోగించుకోవాలి అని, అలాగే కుటుంబ అభ్యున్నతికి, తోడ్పడాలి అని అసించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కష్ణా జిల్లా చైర్ పర్సన్ సువార్త మాట్లాడుతూ సమాజంలో ఎంతో మంది ఒంటరి మహిళలు, జీవనోపాధి లేక, తమ పిల్లలను పోషించుకోలేక, చిన్న వయస్సులో పనులకు పంపడం, ఆడపిల్లకు బాల్య వివాహాలు చేయడం చేస్తూ వారి నిస్సహాయత వలన వారి బంగారు భవిష్యత్తును పాడు చేస్తున్నారు అని అన్నారు. ఆడపిల్లలకు 18 సం. నిండనిదే , మగ పిల్లలకు 21 సం నిండనిదే వివాహాలు చట్ట రీత్యా నేరం అని అన్నారు. డా.ధన్వంతరి ఆచారి, బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్ పాల్, రోటరీ ప్రెసిడెంట్ లింగం మిసెస్ ,రోటరీ వైస్ గవర్నర్ జ్యోతి , కుమారి. అజ్మున్నీసా బేగం,ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగిసెట్టి డానియల్ పాల్గొని ప్రసంగించారు.

కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

## జడ్‌పి హైస్కూల్ హెచ్ఎంకు సత్కారం

హెచ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-ఘంటసాల :** ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన శ్రీకాకుళం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం అమ్మిరెడ్డి అను పల్లవి భువనేశ్వరిని శ్రీకాకుళంకు చెందిన అంగన్వాడీ టీచర్లు, ఆయాలు శనివారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రాంగణంలోని సభా వేదిక వద్ద జరిగిన కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ వత్తిపట్ల నిబద్ధత కలిగిన భువనేశ్వరికి అవార్డు రావటం అభినందనీయమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, ఎంతో మంది విద్యార్థుల విద్యాబివృవద్ధికి కృషి చేసిన భువనేశ్వరి అభినందనీయురాలని కొనియాడారు. అనంతరం దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం గ్రామంలోని అంగన్వాడీ టీచర్లు ఆదిరాల కనకదుర్గ, శివరాణి, పి.రాజ్యలక్ష్మి, కె.మారెమ్మ, పుష్పరాణి, మంజుష, ఎన్.నిర్మల జ్యోతి, ఆయా సిహెచ్. ఉషారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 9 వరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ : కలెక్టర్

రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్

**ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా ) :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 9 వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి రాజబాబు తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ భారత ఎన్నికల సంఘం తాజా ఉత్తర్వుల మేరకు ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం షెడ్యూల్లో కొన్ని మార్పులు చేసిందన్నారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, హేతుబద్ధీకరణ ప్రక్రియ ఈనెల 9 వ తేదీ వరకు జరుగుతుందన్నారు .ఈనెల 10వ తేదీ నుండి 26వ తేదీ వరకు ఫార్మేట్ ఒకటి నుండి 8 తయారీ, సప్లి సప్లిమెంట్లు, సమగ్ర ముసాయిదా జాబితా తయారీ చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 27వ తేదీన సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. ఆరోజు నుండి డిసెంబరు 9వ తేదీ వరకు క్లెయిము ఫారాలను, అభ్యంతరాలను అందజేయవచ్చన్నారు. వచ్చే డిసెంబర్ 26 తేదీ నాటికి అన్ని క్లెయిము ఫారములు, అభ్యంతరాలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. వచ్చే 2024 జనవరి 1 వ తేదీ నాటికి ఓటర్ల జాబితా అంతిమ ప్రచురణ ముందు సరిగా ఉందా లేదా పరిశీలించడం జరుగుతుందన్నారు. అనంతరం వచ్చే 2024 జనవరి 5 వ తేదీన ఓటర్ల జాబితాను అంతిమంగా ప్రచురించడం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల సాధారణ ఎన్నికల్లో ఎన్నికల జాబితానే వినియోగించడం జరుగుతుందన్నారు. రాబోవు ఎన్నికల దష్ట్యా జిల్లాకు కొత్తగా 5620 బ్యాలెట్ యూనిట్లు, 4380 కంట్రోల్ యూనిట్లు, 5300 వివి ప్యాట్లు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ బెంగళూరు వారి నుండి అందాయని, వాటిని కలెక్టరేట్లోని ఈవీఎం గోదాములో సురక్షితంగా భద్రపరిచామన్నారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్సిపి, టిడిపి, ఐఎన్సి. బిజెపి, సిపిఐ, జనసేన పార్టీల ప్రతినిధులు జీ భగవాన్, ఐ దిలీప్ కుమార్, యశ్వంత్, కే చంద్రశేఖర రావు, పివి గజేంద్రరావు, ఫిలిప్, వి.చౌదరి, కలెక్టరేట్ సమన్వయ తహసిల్దార్ సురేష్, డిటి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాల్లో

## జిల్లాకు మూడో స్థానం : కలెక్టర్

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** జిల్లాలో ఇప్పటిదాక (5వ తేదీ వరకు) 121 జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించినట్లు జిల్లా కలక్టర్ పి రాజాబాబు తెలిపారు. ఈ క్యాంపుల్లో 50 వేల మంది ఓపిలో నమోదు అయ్యి ఆరోగ్య పరీక్షలు చేయించు కున్నారని, ఒక్కొక్క క్యాంపులో సరాసరి ఓపీ 413 మందితో రాష్ట్రంలో కష్ణాజిల్లా మూడో స్థానంలో నిలిచిందని కలెక్టర్ తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె ఎస్ జవహర్ రెడ్డి శనివారం జిల్లా కలెక్టర్లు జాయింట్ కలెక్టర్లతో వెలగపూడి సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణ, సుస్థిరాభివద్ధి లక్ష్యాలు సాధన, జగనన్నకు చెబుదాం, గడపగడపకు మన ప్రభుత్వం, గహ నిర్మాణం-జగనన్న కాలనీలలో ఆర్చిల నిర్మాణం, బాల్య వివాహాల అరికట్టే చర్యలపై సమీక్షించారు. క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్ జిల్లా ప్రగతి వివరిస్తూ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు సమర్థవంతంగా నిర్వహించి ప్రతి వ్యక్తికి ఆరోగ్య సేవలందించేందుకు కషి చేస్తున్నట్లు తెలిపారు, ఈ కార్యక్రమాల పర్యవేక్షణకై ప్రత్యేక అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.జిల్లాలో 70,760 మంది 0-5 సం. పిల్లలకు పరీక్షలు నిర్వహించగా, వయసు ఆధారంగా 1523 మంది బరువు తక్కువ పిల్లలను, 1713 మంది ఎత్తు తక్కువ పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పోషకాహారం వీరందరూ తీసుకుని ఆరోగ్యం పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ జి గీతాబాయి, ఐసిడిఎస్ పిడి ఎస్ సువర్ణ, డి టి డబ్ల్యూ ఓ ఫణి ధూర్జటి, డీఈవో తాహెరా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహార వారోత్సవాలు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** గుడివాడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ గుడ్లవల్లేరు మండలంలోని శేరీ దగ్గు మిల్లి సచివాలయం వద్ద పోషకాహార వారోత్సవాలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దారపు శ్రీనివాస్ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సక్రమంగా అందేలా అంగన్వాడి కార్యకర్తలు పని చేయాలని కోరారు. విలువైన అనేక రకాల పోషకాహారా పదార్థాలు కలిగిన వీటిని గర్భవతులు, బాలింతలు చిన్నారులు ప్రతిరోజు వినియోగించుకొని ఆరోగ్యకరంగా జీవించాలని కోరారు. అనంతరం ఉత్తమ ఎంపీడీవో గా అవార్డు పొందిన దారపు శ్రీనివాస్ కు తాసిల్దార్ అబ్దుల్ రెహమాన్ మస్తానా కు ఐసిడిఎస్ సూపర్వైజర్ వాణి, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శాయన రవికుమార్, ఎంపీటీసీ సభ్యులు ముక్కు సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ క్రీడా జట్ల ఎంపిక

**ప్రజాశక్తి-ఉయ్యూరు :** విద్యతోపాటు క్రీడలకు సముచిత ప్రాధాన్యత నిచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులు గా రాణించి పేరు ప్రఖ్యాతులు గడించాలని గుడివాడ డీవైఈవో పద్మారాణి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ స్థాయి బాల బాలికల అథ్లెటిక్స్ జట్ల ఎంపికకు పోటీలను ఏజీ అండ్ సీఎస్ కళాశాల మైదానంలో పద్మారాణితో పాటు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బుచిరెడ్డితో కలసి శనివారం ప్రారభించారు, పెనమలూరు, కంకి పాడు, ఉయ్యూరు మండలాలకు చెందిన 200 మంది విద్యార్థినీ విద్యార్థులు పోటీల అ ధ్యక్ష కార్యదర్శులు మంగయ్య, వై.మురళి, అథ్లెటిక్స్ కోచ్ వరలక్ష్మి, కంకిపాడు మండల స్పోర్ట్స్ ఇన్చార్జ్ హరిగోపాల్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొ న్నారు.

# ఆశాల నిర్బంధం దుర్మార్గం

### జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల

### కృపమ్మ మృతి, నేతల అరెస్టుపై ఉమ్మడి కృష్ణాజిల్లాలో నిరసనలు

**ప్రజాశక్తి - విజయవాడ :** గుంటూరు జిల్లా తాడేపల్లిలో ప్రభుత్వ ఒత్తిళ్లతో ఆకస్మికంగా చనిపోయిన ఆశా వర్కర్ కపమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులను, సిఐటియు నాయకులు, ఆశా కార్యకర్తలను శుక్రవారం రాత్రి అరెస్టు చేసి పోలీసుస్టేషనోల నిర్బంధించడాన్ని నిరసిస్తూ శనివారం ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జగనన్న సురక్ష కార్యక్రమం కింద చేపట్టిన వైద్య శిబిరాల్లో విధులను నిలుపుదల చేసి నిరసన తెలిపారు. పిహెచ్‌సిల వద్దా ఆందోళన నిర్వహించారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ, పెనుంచిప్రోలు, జగ్గయ్యపేట, వీరులపాడు, నందిగామ, మైలవరం, ఎ.కొండూరు, కృష్ణాజిల్లా మచిలీపట్నం, ఉయ్యూరు, తోట్లవల్లూరు, కంకిపాడు కేంద్రాల్లో ఆశా వర్కర్లు ఆందోళనలు నిర్వహించారు. విజయవాడ లెనిన్ సెంటర్లో జరిగిన నిరసనలో యూనియన్ ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుండి శనివారం ఉదయానికి కపమ్మ కుటుంబానికి నష్టపరిహారం ప్రకటన వస్తుందని నమ్మబలికిన అధికారులు అందుకు విరుద్ధంగా నాయకులను, ఆశా కార్యకర్తలను మరోసారి అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆశ వర్కర్లు ఆందోళన చేయడంతో ప్రభుత్వం అధికారులు అనివార్యంగా దిగిరాక తప్పలేదన్నారు. కృపమ్మ కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, భర్తకు వికలాంగుల పెన్షన్, మట్టి ఖర్చుల కింద రూ.25 వేలు ఇస్తూ, అధికారులు చర్యలు తీసుకోవడం యూనియన్ పోరాటం ద్వారానే సాధ్యమైందన్నారు. ఈకార్యక్రమంలో సిఐటియు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఇ.వి.నారాయణ, చౌదరి, కె.దుర్గారావు, ఇ.దుర్గా లక్ష్మి, పిపి.శ్రీలక్ష్మి, ఎస్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

పతాకావిష్కరణలో అండ్ర మాల్యాద్రి, జి.నటరాజు, క్రాంతి తదితరులు

## బిజెపి ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరువు : మాల్యాద్రి

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** మనువాద మతోన్మాద బిజెపి ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరువైంద కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి అన్నారు. కెవిపిఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మొగల్రాజపురం బందులదొడ్డి సెంటర్లో కెవిపిఎస్ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిటీ కార్యదర్శి గుండిమెడ క్రాంతి కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో మాల్యాద్రి మాట్లాడుతూ 1998లో ఆత్మ గౌరవం, సమానత్వం, కులనిర్మూలన లక్ష్యాలతో కెవిపిఎస్ పోరాడుతోందన్నారు. దళితుల పక్షాన నికరంగా నిలబడి రాజీలేని పోరాటాలు చేసి జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏర్పాటు, సిఫార్సులు, శ్మశానాల జివో 1235, ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని సాధించినట్లు చెప్పారు. కెవిపిఎస్ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి జి.నటరాజ్ మాట్లాడుతూ మహనీయుల స్ఫూర్తితో ఐక్యంగా ఉద్యమించినప్పుడే ఫలితాలు వస్తాయన్నారు. ఈకార్యక్రమంలో డానియేలు, స్వరూప్, రత్న, రాజేష్, హిట్లర్, నాగరాజు, కుమార్ దాసు, కిరణ్, విజయ్ పాల్గొన్నారు.

## ఎస్ఆర్ శంకరన్‌కు నివాళి

**ప్రజాశక్తి - విజయవాడ :** విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్ తదితరులు శనివారం లెనిన్ సెంటర్ సమీపంలోని అంబేద్కర్ భవన్‌లో రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఆర్.శంకరన్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఉమ్మడి ఎపికి, వెనకబడిన వర్గాలకు ఆయన చేసిన ఎనలేని కృషిని స్ఫూర్తిగా తీసుకుని సమాజభివద్ధికి పాటుపడాలని అన్నారు. జీవితమంతా ప్రజలకు నిబద్ధులై ఉండే అరుదైన అధికారుల్లో శంకరన్ ఒకరని కొనియాడారు.

## నేడు 'ప్రేరణ' పరిచయ సభ

**ప్రజాశక్తి - విజయవాడ :** మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో కొమ్మవరపు విల్సన్ రావు కవితా సంపుటి 'దేవుడు తప్పిపోయాడు' పై పీఠికలు, విశ్లేషణల వ్యాససంకలనం 'ప్రేరణ' పరిచయ సభ ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఠాగూర్ గ్రంథాలయంలో జరుగుతుందని అధ్యక్షులు కె.కలిమిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో ఓయస్ డి టూ గవర్నమెంట్, సుప్రసిద్ధ రచయిత డాక్టర్ ఎం.ప్రభాకర్, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, సుప్రసిద్ధ సాహితీవేత్త, జి.లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొంటారని తెలిపారు.

## మొదటిపేజీ తరువాయి

### ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరిస్తున్న బాబూరావు

## నగరాభివృద్ధికి ప్రణాళికలేవీ?

ఇబ్బందలతో తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో డివి కృష్ణ, డి.కాశీనాథ్, సెంట్రల్ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు కె.దుర్గారావు, ఎం.సీతారాములు, టి.ప్రవీణ్, ఐద్వా సెంట్రల్ సిటీ కార్యదర్శి ర్ఘున్నీ, సిపిఎం నాయకులు పి.కృష్ణమూర్తి, చింతల శ్రీనివాసరావు, వై.సుబ్బారావు, ఎస్‌కె పీరు సాహెబ్, వివిధ సంఘాల నేతలు యు.శివలింగేశ్వరరావు, ఎస్‌కె.నిజాముద్దీన్, ఆషా, దేవి కుమారి, బి అమ్ములు, పి పిచ్చమ్మ, ఎస్ విజయలక్ష్మీ, పిఎస్ఎన్ మూర్తి, వేముల శ్రీను, ఎస్‌కె మమూద్, సిహెచ్.అరుణ, లీలాసాగర్, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరమ్మ, డి నాగమ్మ, వి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలను తెలుసుకుంటూ...మున్ముందుకు

'సిపిఎం ప్రజాపోరు పాదయాత్ర' తొలి రోజు ప్రజాసమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగింది. సింగ్‌నగర్ 58, 61 డివిజన్లలో పాదయాత్ర జరిగింది. 58వ డివిజన్ డాబాకొట్లు సెంటర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర వివేకానంద స్కూల్ రోడ్డు, పిఅండ్‌టి కాలనీ, షాదీఖానా, శివాలయం మీదుగా డాబాకొట్లు, వడ్డెర ప్రాంతాల్లో సాగింది. సాయంత్రం 61వ డివిజన్‌లోని శాంతినగర్, ఎన్‌టిఆర్ బొమ్మ, పార్కు సెంటర్, మోటూరు హనుమంతరావు కళ్యాణమండపం, తుపాకుల రామకృష్ణ పార్కు ఏరియా, దేవినేని గాంధీపురం తదితర ఏరియాల్లో జరిగింది. డిమాండ్లతో కూడిన బ్యానర్‌ను చేబూని నాయకులు ముందు వరుసలో నడవగా, జెండాలు చేబూని కార్యకర్తలు వీధివీధికి తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు సిపిఎం నేతల వద్దకు వచ్చి ప్రజాప్రతినిధులు చేసిన వాగ్దానాలు, వాటి పరిస్థితిని పాదయాత్ర దృష్టికి తీసుకొచ్చారు. డాబాకొట్లు సెంటర్లో మున్సిపల్ కార్మికులు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా ఇళ్ల స్థలాలు, పట్టాలు, రిజిస్ట్రేషన్లు, టిడ్కో గృహాల పంపిణీ సమస్యతోపాటు సింగ్‌నగర్ రెండో ఫ్లైఓవర్ ఆవశ్యకత, డ్రైనేజి, వీధి దీపాలు, అస్తవ్యస్తంగా ఉన్న పార్కుల నిర్వహణ, వాటిలో అసాంఘిక కార్యకలాపాలు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రజలు నేతల దృష్టికి తీసుకొచ్చారు. అలాగే మంచినీటి సమస్య, దోమలు, జ్వరాలు తదితర సమస్యలు వెలుగు చూశాయి.

### నేడు పాదయాత్ర సాగే ప్రాంతాలు

'సెంట్రల్ నియోజకవర్గం అభివద్ధి - ప్రజా సమస్యల పరిష్కారం' పేరుతో చేపట్టిన సిపిఎం ప్రజాపోరు పాదయాత్ర రెండో రోజు ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. 62వ డివిజన్ ప్రకాష్ నగర్ (నున్న పోలీస్ స్టేషన్ రోడ్డులోని సిపిఎం కార్యాలయం నుండి) నుండి ప్రారంభమై 62, 63 డివిజన్లలో సాగుతుంది.

## కాలానుగుణంగా మార్పు అవసరం

ఇన్స్టిట్యూట్ కన్సల్ట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఏ.పూర్ణానంద్ మాట్లాడుతూ కళాకారులకు మారిన సాంకేతిక అద్భుత వరమని, చిన్నా పెద్దా అందరూ ఈ పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. విశిష్ట అతిథులుగా హాజరైన గుంటూరు రామరాజు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క పిల్లవాని చేతిలో ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు ఉంటున్నాయని, వాటిని ఎలా ఉపయోగించాలో వారికి తెలియజేస్తే వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న సజనాత్మక శక్తితో అద్భుతాలు సృష్టించగలరని అన్నారు. మరో విశిష్ట అతిథి ఇన్నర్ వీల్ క్లబ్ మిడ్‌టౌన్ ప్రెసిడెంట్ హరితా చౌదరి మాట్లాడుతూ ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ టీం గత మూడు నెలలుగా చిత్రకళారంగానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జాషువా సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి గుండు నారాయణరావు మాట్లాడుతూ ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ టీం వెలిగించిన చిత్రకళా దీపాలు రాష్ట్రమంతా చిత్రకళా పండుగలకు దోహదం చేస్తాయన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా నవంబర్‌లో స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్, ఆర్ట్ మేట్ స్కూల్ ఆఫ్ ఆర్టిస్ట్స్, చిత్రం ఆర్ట్ ఇనిస్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ఆర్ట్ ప్యారడైజ్" పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ కన్వీనర్ సునీల్ కుమార్ అనుమకొండ అధ్యక్షత వహించగా, కార్యక్రమ నిర్వాహకుడు స్ఫూర్తి శ్రీనివాస్ పర్యవేక్షించగా..కో కన్వీనర్ గిరిధర్ అరసవల్లి, కో ఆర్డినేటర్ ఎస్.పి.మల్లిక్, వర్కింగ్ కమిటీ మెంబర్లు సుబ్బా ఆర్వీ, రమేష్ అర్కాల, శ్రావణ్ కుమార్, మహిళా విభాగపు ఇన్చార్జి ఆమ్రపాలి, సంధ్యారాణి, స్వాతి పూర్ణిమ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

### రాఘవులు, మధు సందర్శన

అనుపోజు జయశ్రీ ప్రభాకర్ డిజిటల్ పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర సీనియర్ నాయకులు పి.మధు తదితరులు సందర్శించారు. ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించి నిర్వాహకులను అభినందించారు.

**SPELLING MISTAKE**

I, Katta Kanakadurga, W/o. Katta Visvanadham, r/o. Kunavaram village, Kunavaram Mandal, Alluri Sitharama Raju District, Andhra Pradesh State do hereby solemnly affirm and sin-cerely state as fol-lows:-

I declare that I was issued a Pass Port bearing No.Y 8213534 My husband name mentioned as **KATTA VISWANADHAM**.

I declare that my Aadhar Card bearing No.8935 3377 0293 in my Aadhar Card my husband's name mentioned as **KATTA VISVANADHAM [spelling mistake]**

Hence I hereby delcare that **KATTA VISWANADHAM.** and also called as **KATTA VISVANADHAM.** are one and same only.

I declare that the above information is true and correct to the best of my knowl-edge and nothing has been concealed therefrom. I also swear that I am liable for prosectuion if any of the above mentioned particulars are found false in future.

**ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి**

విజయవాడ వించిపేటకు చెందిన షేక్ నూర్జహాన్ భర్త షేక్ అబ్దుల్ ఖలీల్, షేక్ షకీలా బేగం భర్త షేక్ మహ్మద్ సలీమ్‌లకు చెందిన వారి ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్స్ (డాక్యుమెంట్స్ నెం. 9223/2017) జిరాక్స్ తీయటం కోసం 6-10-2023న మహమ్మద్ అసదుల్లా వించిపేట నుండి తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గం మధ్యలో ఒరిజినల్ డాక్యుమెంట్ల కవర్ జారి పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింద ఫోన్ నెంబర్‌కు తెలియజేయగలరు.

ఇట్లు
మహమ్మద్ అసదుల్లా
ఫోన్ నెంబర్ : 8885551599

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త**

మన విజయవాడ **ట్రస్ట్ హాస్పిటల్** వారు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అనుమతి పొందియున్నారు. కావున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు రియంబర్స్‌మెంట్ సౌకర్యం పొందే అవకాశాన్ని ఉపయోగించు కోగలరు.

ఫోన్ నెం : 0866 - 2470909

ప్రకటన
మహారాజశ్రీ మచిలీపట్టణం జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారి కోర్టు నందు
**G.W.O.P No 55/2023**
**(IN THE MATTER OF MINOR MOKA. MOKSHITHA (6 YEARS) FEMALE)**

Between
Moka Viswa S/o late Venkata reddy, hindu, aged about 45 years private employee, resident of D.No.48/4/55, Gogudanayya pet, jagannada Puram, Kakinada-533002, East Godavari Dist.
AND
Moka Dhanasri, W/o Moka Viswa Hindu, aged about 41 years D/o D. Simhadri, Contract Lecturer in varalakshmi Poly tech-nic college, Chilakalapudi, Machilipatnam and Mandal, Krishna Dist - 521002

పై నెంబరు GWOP 55/2023 నందు పిటిషనరుకు రెస్పాండెంట్ గారు బార్య అయి ఉన్నారు. వీరి సంతానం మోకా మోక్షిత మైనర్ అయినందున, సదరు పిటిషనరు కష్టడి కోరుతూ మరియు గార్డియన్ గా డిక్లేర్ చేయుటకు పై పిటిషను పిటిషనరు మైనర్ తండ్రిగా దాఖలు చేసి ఉన్నారు. సదరు పిటిషను పై ఎవరికైనా ఎట్టి అబ్యంతరాలు ఉన్న ఎడల పైన తెలిపిన కోర్టువారి ఎదుట ది.30-10-2023న ఉదయం గం 10:30 ని లకు స్వయంగా గాని న్యాయవాది ద్వారా గాని కోర్టుకు హాజరు అయ్యి ఆక్షేపణలు తెలియజేసుకొనగలరు. లేని యెడల మీపరోక్షముగా తీర్మానించబడును.

(శ్రీ కోర్ట్ వారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా తేది: 30-10-2023.

గంజి నాగేంద్రం. BA,BL
న్యాయవాది,
సుకర్లబాదు, మచిలీపట్నం
సెల్ నెం:9885140082
మచిలీపట్నం
ది.08-10-2023

**CHANGE OF NAME**

I YERRAGORLA RAMESH(Old name) S/o.RAMANADHAM H-no:1-98/1, Opp:- Gandhi Center,Vellanki(Village)Veerulla padu (Mandal) N.T.R. District, Andhra Pradesh State.I have changed my name as YARRAGORLA RAMESH my name known as S/o.YARRAGORLA RAMANA DHAM.

Date :07-10-2023 Place :VEERULLAPADU

నోటీసు
మహారాజశ్రీ ఒంగోలు అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
IA NO: 556/23 OS NO: 102/21

వచ్చువ రజిని ...వాది
మరియు
డాక్టర్ డి. కృష్ణమూర్తి నాయక్ మరియు ఇతరులు ...ప్రతివాదులు

To
పాలకీర్తి భవాని, భర్త లేట్ నాగమల్లేశ్వరరావు,
హిందూ, నివాసం ప్లాట్ నెంబర్ 101,
సాయి దుర్గా ఆర్కేడ్, సుబ్బారెడ్డి స్ట్రీట్,
రాజేంద్రనగర్, గుడివాడ, కృష్ణాజిల్లా.

మీరు పై దావాలో మూడవ ప్రతివాది అయి ఉన్నారు ఇప్పటివరకు పై కోర్టు వారి ద్వారా పంపిన నోటీసులు తీసుకోకుండా అవాయిడ్ చేయుచున్నారు అందుచేత కోర్టు వారు ప్రచురణ కొరకు ఆర్డర్ చేసి ఉన్నారు వాయిదా తేదీ 01.11.2023న వేసి ఉన్నారు కనుక ఆ రోజు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు ఒంగోలు అదనవు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో మీరు గాని లేదా మీ తరవున న్యాయవాది ద్వారా గాని హాజరు కావలసింది లేని యెడల మీ వరోక్షముగా కేసు విచారించి తీర్మానించబడును

// కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //
K. అరుణ
వాది తరపు న్యాయవాది
ఒంగోలు ప్రకాశం జిల్లా

ప్రకటన
**మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
ఓ.ఎస్.నెం. 176/2017

కందుల వెంకట నరసింహారావు ...వాది
మరియు
కందుల వెంకట రామారావు మరియు వగైరాలు ...ప్రతివాదులు

***13వ ప్రతివాది:*** గాలి శ్రీనివాస్, తండ్రి: వెంకట్రావు, ప్లాట్ నెం. 435, శ్రీనివాస్ నగర్, బ్యాంక్ కాలనీ, 8 క్రాస్ రోడ్, విజయవాడ.
***14వ ప్రతివాది:*** గాలి వెంకట కృష్ణ, తండ్రి: వెంకట్రావు, ప్లాట్ నెం. 435, శ్రీనివాస్ నగర్, బ్యాంక్ కాలనీ, 8 క్రాస్ రోడ్, విజయవాడ.
***16వ ప్రతివాది:*** అబోతుల నారాయణమ్మ, భర్త: శ్రీనివాసరావు, డో.నెం. 27-1-8, ఆటోనగర్, విజయవాడ.

పై నెంబరు గ్రంథములో 13వ ప్రతివాది అయిన గాలి శ్రీనివాస్, 14వ ప్రతివాది అయిన గాలి వెంకటకృష్ణ, 16వ ప్రతివాది అయిన అబోతుల నారాయణమ్మ గార్లకు శ్రీయుత కోర్టు వారి ద్వారాను మరియు రిజష్టరు పోస్టు ద్వారాను సమన్లు పంపిననూ తీసుకొనక, అందుకొనక కాలయాపన చేయుచున్నారని, దానిపై శ్రీయుత కోర్టు వారు పేపరు ప్రకటనకు అనుమతి మంజూరు చేసియున్నారు. శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ది.01-11-2023 తేదీకి వాయిదా అయి ఉన్నది. కావున 13వ ప్రతివాది అయిన గాలి శ్రీనివాస్, 14వ ప్రతివాది అయిన గాలి వెంకటకృష్ణ, 16వ ప్రతివాది అయిన అబోతుల నారాయణమ్మ గార్లకు **ది.01-11-2023 ఉదయం గం॥ 10:30 ని॥లకు తమ అభ్యంతరములు స్వయంగా గాని, తమ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలియచేసుకోవలెను.** లేని ఎడల సదరు గ్రంథంను 13వ ప్రతివాది అయిన గాలి శ్రీనివాస్, 14వ ప్రతివాది అయిన గాలి వెంకటకృష్ణ, 16వ ప్రతివాది అయిన అబోతుల నారాయణమ్మ గార్లకు గారి పరోక్షమున తీర్మానింపబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

**అల్లూరి వెంకటేశ్వరరావు**
భీమవరం, వాది తరుపు అడ్వకేట్, భీమవరం.
07-10-23. సెల్: 98482 11102

# జగనన్న సురక్షతో ఆరోగ్య భద్రత : మంత్రి

గుడూరు మండలంలో మాట్లాడుతున్న మంత్రి రమేష్

అవనిగడ్డలో...

పమిడిముక్కలలో...

**ప్రజాశక్తి గూడూరు :** ఆరోగ్యాన్ని పరిరక్షించి, ప్రజల ఆయుష్షును పెంచే బాధ్యతను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వీకరించారని రాష్ట్ర గహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు.గూడూరు మండలం మల్లవోలు గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలని జగనన్న ఆరోగ్య సురక్షను ప్రవేశపెట్టారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 162 రకాల నాణ్యమైన మందులు సిద్ధంగా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎంపీపీ సంగా మధుసూదన్ రావు, జడ్పిటిసి వేముల సురేష్ రంగబాబు, కారుమంచి కామేశ్వరరావు, తలుపుల వెంకటకష్ణ, గొరిపర్తి రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పర్ణం పెద్దబాబు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ :** జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా ప్రతి పేదవాడి ఆరోగ్య భద్రతను జగన్మోహనరెడ్డి ప్రభుత్వం తీసుకుందని మాజీ మంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని అన్నారు. మచిలీపట్నం వర్రెగూడెంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఆయన పలురకాల వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, వైసిపి యువ నాయకుడు యూత్ వింగ్ జోనల్ ఇంఛార్జ పేర్ని కష్ణమూర్తి ( కిట్టు ), డిప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి , పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** పమిడిముక్కల మండలం లోని తాడంకి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, జడ్పిటిసి సభ్యురాలు ఏనుగు వెంకటరమణ కుమారి, తాసిల్దార్ రాజ్యలక్ష్మి, మండల ఉపాధ్యక్షులు గంజాల సీతా రామయ్య, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంబపు రాంబాబు, వైయస్సార్ పార్టీ నాయకులు ఏనుగ మస్తాన్రావు, కోడిపోయిన కోటేశ్వరావు, సొంటి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి కూచిపూడి శ్రీలక్ష్మీ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందిస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. శనివారం చల్లపల్లి మండలం పాగోలులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు పేదలకు వివరించారు. . జడ్పిటిసి రాజులపాటి కళ్యాణి, ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్షాద్ నజరానా, గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాసరావు, వైద్యాధికారులు, అధికారులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండల పరిధిలోని శేరీ దగ్గు మిల్లి గ్రామ సచివాలయం వద్ద శనివారం 'జగనన్నఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని ప్రజల వారి ఆరోగ్య సమస్యలను పరిశీలించి అవసరమగు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు.కంటి పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి కళ్ళ జోళ్ళు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవికుమార్, ఎంపీటీసీ ముక్కు సోమేశ్వరరావు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్ , వార్డు మెంబర్లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెదపారుపూడి :** పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేసినట్లు మండల ప్రత్యేక అధికారి జిల్లా పశువర్ధ శాఖ అధికారి డాక్టర్ పి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని భూషణ గోళ్ళ సచివాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, తాసిల్దార్ వి నాగభూషణం, గోళ్ళ సోమేశ్వరరావు, రాజు, వి. శ్రీనివాస్ (వంశీ ), పార్టీ జిల్లా కార్యదర్శి మూల్పూరి హరీష పాల్గొన్నారు . **ప్రజాశక్తి-మోపిదేవి :** అవనిగడ్డ నియోజకవర్గం మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ కొత్తపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ ల్లో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రమేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్ వాడీ కేంద్రాల సిబ్బంది తయారు చేసిన పౌష్టికాహార పదార్థాలను రమేష్ బాబు పరిశీలించి రుచి చూశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిదులు, పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఘంటసాల :** ఘంటసాల మండలం పాప వినాశనం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శనివారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేద వర్గాల ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు ప్రసంశనీయమైనవి అన్నారు. వైస్ ఎంపిపి కుంపటి నాగేంద్ర బాబు, సర్పంచ్ లు కుంపటి అనిత, రాచూరి ప్రసాదు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లి మండలం ములపర్రు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్షలో వైసిపి యువ నాయకుడు జోగి రాజీవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బంటుమల్లి ఎంపీపీ వెలివెల చిన్నబాబు, బంటుమిల్లి వైస్ ఎంపీపీ ఒడిమే చిన్నారిబాబు, బంటుమిల్లి మండల కన్వీనర్ సుజ్ఞానం మహేష్, ప్రెసిడెంట్ బొడ్డు మంగమ్మ, మద్దాల నరేష్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** మండల పరిధిలోని అశ్వరావు పాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ తుంగల సుమతి దేవి పాల్గొని ప్రసంగించారు. ఎంపీడీవో మరియాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష, వైసీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానంతో ప్రాణదానం

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ ఏ వీర కుమారి ఆధ్వర్యంలో రక్త వర్గ నమూనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవనిగడ్డ బ్రాంచ్ చైర్మన్ వంగర శేషగిరిరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కరు రక్తదానం చేయడం ద్వారా ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చు అని చెప్పారు. ఆపద సమయంలో తెలియడం వల్ల చికిత్స చేయడం వేగంగా జరుగుతోందని తెలిపార.ు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఉమారాణి మాట్లాడుతూ రక్త నమూనా నిర్ధారణ పరీక్షల ద్వారా మన రక్తపు గ్రూపు తెలుసుకోవచ్చని దీనివల్ల మనకు ప్రమాదం ఏర్పడినప్పుడు అలాగే ఇతరులకు ప్రమాదం జరిగినప్పుడు అత్యవసర సమయాలలో రక్తదానం సులభతరం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజనాల అంకారావు. ఐక్యూఏసి కోఆర్డినేటర్ పి సంధ్య శ్రీ, టెక్నీషియన్ ఆనంద్ పాల్గొన్నారు

## నిమ్మగడ్డపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి-గుడివాడ :** ఇటివల గుడ్లవల్లేరు మండలం కౌతరం గ్రామంలో తెలుగుదేశం కార్యకర్త రాజులపాటి వీరవెంకట సత్య నారాయణ దంపతులపై జరిగిన దాడి వివరాలను రాష్ట్ర పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడికి వివరించి దాడికి కారణమైన నిమ్మగడ్డ సత్యసాయిపై పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. శనివారం టిడిపి పట్టణ రూరల్ అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీలు ఒక ప్రకటన చేస్తు టిడిపి నాయకులపై దాడికి కారణమైన నిమ్మగడ్డసాయిపై చర్యలు తీసుకో వాలని అచ్చెన్నాయుడికి పిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొడాలి రామరాజు, నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గోవాడ శివా, పట్టణ ప్రధాన కార్యదర్శి పాలసీ ఉమామహేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు పొట్లూరు కష్ణారావు శొంటి రామకష్ణ పాల్గొన్నారు.

## మట్టి ఖర్చులకు నగదు అందజేత

**ప్రజాశక్తి-ఘంటసాల :** ఘంటసాల మండల పరిధిలోని పూషడం గ్రామానికి చెందిన కోళ్లపల్లి రాధాకష్ణ శనివారం మతి చెందగా, వైఎస్సార్ బీమా పథకానికి అర్హులు కావటంతో శనివారం భార్య నాగలక్ష్మికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా లంకపల్లి పీఏసీఎస్ అధ్యక్షులు, వైసీపీ నాయకులు గల్లా గిరీష్ మాట్లాడుతూ వైఎస్సార్ బీమా పథకం మరణించిన కుటుంబాలకు ఎంతగానో చేయూతగా నిలుస్తుం దన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి బీమా పథకం ద్వారా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు, అనంతరం రూ.90 వేల నగదును అందిస్తున్నట్లు వివరించారు. ఈ నగదు పంపిణీ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు చీడేపూడి శ్రీనివాసరావు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రాము, వలంటీర్లు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

**ప్రజాశక్తి-చల్లపల్లి :** ఉపాధి హామీ కూలీల మస్టర్లు సమర్పించ కుండా నిర్లక్ష్యం వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ తీరుపై కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చల్లపల్లి మండలం మాజేరు గ్రామానికి చెందిన ఉపాధి కూలీలకు మే నెలలో చేసిన పని వేతనం రాలేదని శనివారం చల్లపల్లి వచ్చి ఎంపీడీఓను కలిశారు. సమస్య విన్న ఎంపీడీఓ సీహెచ్.చిన రాట్నాలు మస్టర్ సబ్మిట్ కానట్లు గుర్తించి, ఫీల్డ్ అసిస్టెంట్ మద్దాల వెంకటేశ్వరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు సక్రమంగా నిర్వర్తించాలని హెచ్చరించారు. సమస్య పరిష్కారం చేస్తామని ఉపాధి పథకం కూలీలకు ఎంపీడీఓ హామీ ఇవ్వటంతో కూలీలు ఆందోళన విరమించారు.

# కల్తీ వంటనూనె వ్యాపారం గుట్టురట్టు

కల్తీ వంట నూనె డబ్బాలు

**ప్రజాశక్తి - మైలవరం :** మైలవరంలో గత కొంత కాలంగా జరుగుతున్న కల్తీ నూనె వ్యాపారం గుట్టు రట్టయింది. గ్రామంలోని నూజివీడు రోడ్డులో కల్తీ నూనె తయారు చేసి విక్రయాలు సాగిస్తున్న ప్రదేశంపై కొందరు ఇచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బంది శనివారం దాడులు నిర్వహించి కల్తీ నూనె డబ్బాలను పరిశీలించారు. అప్పటికే తరలించేందుకు సిద్ధంగా ఉన్న కల్తీ నూనెల తనిఖీలు చేశారు. రెవెన్యూ సిబ్బంది వస్తున్నారన్న సమాచారంతో కొన్ని డబ్బాల్లో నూనెను తయారీదారుడు అప్పటికే నేలపాలు చేశారు. నూనె నుండి భరించలేని దుర్వాసన వస్తుండటంతో రెవెన్యూ అధికారులు పరిశీలన చేసి పూర్తి వివరాలు సేకరించి తయారీదారుడిని తహశీల్దార్ వద్దకు తీసుకెళ్లారు. తయారు చేసిన కల్తీ వంట నూనెలను స్థానికంగా ఉన్న కొన్ని చిన్న, చిన్న టిఫిన్ సెంటర్లు, బేకరీ, సమోసా సెంటర్లకు సరఫరా చేసి కాసులు దండుకుం టున్నట్లు సమాచారం. కల్తీ నూనెలతో తయారు చేసిన ఆహారం(టిఫిన్) తిన్న వారు అనారోగ్యానికి గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇలాంటి ప్రబుద్ధులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.కల్తీ నూనె విషయమై విఆర్ఓ తరుణ్ వివరణ కోరగా ఆయన స్పందిస్తూ కల్తీ నూనె తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తి వద్ద నుండి స్టేట్‌మెంట్ రికార్డ్ చేసినట్లు తెలిపారు. కల్తీ నూనె నిర్ధారణకు అతనిపై చర్యల కొరకు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌కు సిఫార్సు చేసినట్టు తెలిపారు.

## టిడిపి జెండా దిమ్మె ధ్వంసం

**ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్**

బందరు మండలం తప్పసిపూడి పంచాయతీలో తెలుగుదేశం పార్టీ జెండా దిమ్మను దుండగులు ధ్వంసం చేశారు. దిమ్మెను ధ్వంసం చేసిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి దిమ్మను వెంటనే అక్కడ నిర్మించాలని డిమాండ్ చేస్తూ బందరు తాలూకా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసున్న మండల పార్టీ అధ్యక్షుడు కుంచె నాని, గ్రామ పార్టీ అధ్యక్షుడు తోట రామ కష్ణ, మాజీ సర్పంచ్ నాంచారయ్య, లంకే హరికష్ణలు ఫిర్యాదు చేశారు.

## 10న మహాధర్నాను జయప్రదం చేయాలి

**పెనమలూరు :** విఒఓల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 10,11 తారీఖుల్లో బందర్ కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే మహాధర్నా వంటావార్పును జయప్రదం చేయాలని సిఐటియు కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు ఆధ్వర్యంలో పెనమలూరు మండల వెలగు ఆఫీసులో ఎపిఎం గోవింద్ రాజుకు విఒఎలు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి జరిగే ఈకార్యక్రమంలో విఒఎలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాలాది ఝాన్సీ, పెనమలూరు మండల సిఐటియు విఒఎల కార్యదర్శి. సునీత, ఎస్.కె సాంబ, నిర్మల, బాలమ్మ. రజిని తదితరులు పాల్గొన్నారు.

## దాసరి పుట్టినరోజు వేడుకలు

**ప్రజాశక్తి హనుమాన్ జంక్షన్ :** మాజీశాసన సభ్యులు దాసరి వెంకట బాలవర్ధనరావు జన్మదిన వేడుకలను హనుమాన్ జంక్షన్ లో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయంలో టిడిపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ జెడ్పిటిసి వేగిరెడ్డి పాపారావు ఐరన్ షాప్ నందు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి, బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్, రాష్ట్ర టిడిపి బి సి సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి చెన్నుబోయిన టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ స్వప్న

## ఆధునిక జీవనశైలి సంతానలేమికి కారణం

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ :** " స్త్రీ, పురుషుల ఆధునిక జీవనశైలి సంతానలేమికి దారి తీస్తోందని, ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్తుల జీవనశైలి అనేకమందిలో సంతాన సాఫల్యతను మరింత క్లిష్టతరం చేస్తోందని ప్రముఖ ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్టు డాక్టర్ వై.స్వప్న అన్నారు. బెంజిసర్కిల్ వద్ద గల వాసవ్య నర్సింగ్ హోమ్ నందు ' సంతాన లేమి సమస్య ఎవరికి ' అనే అంశంపై శనివారం ఆరోగ్య సదస్సు జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ స్వప్న మాట్లాడుతూ సరైన అవగాహనతో వీరి జీవనశైలిలో కలిగించుకునే మార్పులతో సంతానలేమి సమస్యను, లైంగిక సమస్యలను అధికమించవచ్చు " అని అన్నారు. సాధారణంగా 15శాతం దంపతుల్లో సంతానలేమి సమస్య ఉంటుందన్నారు. వివాహమై సంవత్సరమైనా వారానికి 1-2సార్లు కలిసే దంపతులకి గర్భం రానప్పుడు సంతానలేమి సమస్య ఉందని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ జి.మారు అధ్యక్షత వహించగా, సభలోని పలువురు ప్రశ్నలడిగి సందేహ నివృత్తి చేసుకున్నారు.

మాట్లాడుతున్న నాయకులు

## 9న బైక్‌యాత్ర

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట:** మండలంలోని షేర్ మహమ్మద్ పేట, రామచంద్రుని పేట, అనుమంచిపల్లి గ్రామ ప్రజల ఆరోగ్యాలను హరిస్తున్న గ్రీన్ టెక్ ఫ్యాక్టరీ తీసివేయాలని సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ జరగబోయే బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని సిపిఎం జగ్గయ్యపేట మండల,పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి కోరారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా షేర్ మహమ్మద్ పేటలోని గ్రీన్ టెక్ ఫ్యాక్టరీని తీసివేయాలని పోరాటాలు చేస్తున్నా స్పందించకపోవడంతో ఈ బైక్‌యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాకనబోయిన లింహరావు, తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదానానికి విరాళం

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి ఖమ్మం వాస్తవ్యులు కోరిటాల రాహుల్, సాహితి రూ.10116/- లు విరాళంగా అందజేశారు. దాతలకు శ్రీ స్వామి వారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసినట్లు ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ పసుపులేటి రాధా సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆలయ సహాయకమిషనర్, కార్యనిర్వహణాధికారి సి.జయప్రకాశ్ బాబు తెలిపారు.

## డంపింగ్ యార్డుగా రోడ్డు

**ప్రజాశక్తి - తిరువూరు :** తిరువూరు పట్టణంలో మల్లమ్మ చెరువుకు అనుకుని ఉన్న అక్కపాలెం రోడ్డును నగర పంచాయతీ అధికారులు డంపింగ్ యార్డుగా మార్చి ప్రజలను రోగాలకు గురిచేస్తున్నారని సిపిఎం నాయకులు ఆరోపించారు. శనివారం ప్రాంతంలో పర్యటించిన సిపిఎం నాయకులు నూకల సత్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు, మాచిపోయిన వెంకట్రావు, కాగిత రాములు రోడ్డుకు ఇరుపక్కల చెత్తా చెదారంతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతుందని విలేకర్ల తెలిపారు. దీనివల్ల చుట్టుపక్కల నివాస ప్రజలు డెంగ్యూ, విష జ్వరాల బారినపడి ఆసుపత్రి పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చెత్తను, వ్యర్థాలను తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సిపిఎం నాయకులు కోరారు.

### పవన్ వ్యూహంతో

# టిడిపిలో గందరగోళం

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నాలుగు రోజులపాటు కృష్ణాజిల్లాలో జరిపిన పర్యటనలో అనుసరించిన వ్యూహాలు టిడిపి శ్రేణులను తీవ్ర గందరగోళానికి గురిచేస్తున్నాయి. తాము ప్రధాన ప్రతిపక్షం టిడిపితో కలిసి వెళతామని చెబుతూ ఆ పార్టీ శ్రేణులతో పవన్ మరింత సఖ్యతకు ప్రయత్నించారు. రాష్ట్ర ప్రయోజనాలకోసం పదేళ్లపాటు టిడిపితో వెళ్లక తప్పదని బహిరంగ సభల్లో చెప్పుకొచ్చారు. అయితే పార్టీ అంతర్గత సమావేశాల్లో మాత్రం తాము కూడా అధికారంలో భాగస్వాములం అవుతామని ప్రకటించి సొంత కేడర్ చెదిరిపోకుండా వారికి భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే టిడిపితో వెళితే వచ్చే ఎన్నికల్లో కృష్ణాజిల్లాలో జనసేనకు కేటాయించే అసెంబ్లీ సీట్ల అంశం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో తమకు సీటు దక్కదని భావిస్తున్న ఒకరిద్దరు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జుల్లో ఆందోళన బయలుదేరింది.

నాలుగో విడత వారాహి విజయయాత్రలో భాగంగా అక్టోబర్ ఒకటి నుండి నాలుగో తేదీ వరకు జిల్లాలోని అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన అసెంబ్లీ నియోజకవర్గాల్లో పవన్ కళ్యాణ్ పర్యటించారు. రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో టిడిపి అధినేత చంద్రబాబును కలిసి వచ్చిన తర్వాత ఆ పార్టీతో కలిసి వెళతామని పవన్ ప్రకటించారు. ఆ తర్వాత మొదటిసారిగా జరిగిన ఈ పర్యటనలో మూడు నియోజకవర్గాల్లోనూ పవన్‌కు జనసేన నాయకులు, కార్యకర్తలతోపాటు టిడిపి శ్రేణులు స్వాగతం పలికాయి. ర్యాలీలు, సభల్లోనూ రెండు పార్టీల జెండాలు రెపరెపలాడాయి. పవన్ పర్యటించిన మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ గత ఎన్నికల్లో జనసేనకు గణనీయమైన ఓట్లు వచ్చాయి. జనసేన ఓట్ల చీలికతోనే టిడిపి ఓటమి పాలయిందని రాజకీయ విశ్లేషణలు వెలువడ్డాయి. తాజాగా ఈ రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరితే వచ్చే ఎన్నికల్లో ఈ మూడు స్థానాల్లో కూటమి విజయం సాధిస్తుందనే విశ్వాసాన్ని జనసేన, టిడిపి శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. జనసేనకు ఓటు బ్యాంకు కలిగి ఉన్న ఈ మూడు నియోజకవర్గాల్లోనూ పోటీ చేయాలని పవన్ పర్యటన అనంతరం ఆ పార్టీ శ్రేణులు ఆశిస్తున్నాయి. మూడు సాధ్యంకాకుంటే కనీసం రెండు సీట్లలోనైనా జనసేన అభ్యర్థులను నిలబెట్టాలని కోరుతున్నాయి. టిడిపితో సీట్ల సర్దుబాటులో మచిలీపట్నం స్థానాన్ని వొదులుకోవద్దని జనసేన స్థానిక నేతలు ఇప్పటికే ప్రకటన చేయడం చర్చనీయాశంగా మారింది.

టిడిపి అవనిగడ్డ నియోజకవర్గ టికెట్‌ను మాజీ ఉప సభాపతి మండలి బుద్ద ప్రసాద్, మచిలీపట్నం టికెట్‌ను మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర, పెడన టికెట్‌ను ఆ నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి కాగిత కృష్ణప్రసాద్, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ ఆశిస్తున్నారు. పొత్తులో భాగంగా జనసేనకు ఆ సీట్లను కేటాయిస్తే వచ్చే ఎన్నికల్లో తమకు పోటీ చేసే అవకాశం తమకు ఉండదనే ఆందోళన టిడిపి నేతల్లో వ్యక్తమవుతోంది. పవన్ నిర్వహించిన సభలు, జనవాణి కార్యక్రమాల్లో వైసిపిని లక్ష్యంగా చేసుకుని తీవ్ర ఆరోపణలు చేశారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డితోపాటు ఆయా నియోజకవర్గాల్లో వైసిపి ప్రజాప్రతినిధులైన సింహాద్రి రమేష్‌బాబు, పేర్ని నానిని, మంత్రి జోగి రమేష్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర ఆరోపణలు చేశారు. ఇసుక, బుసక, మట్టి అక్రమ రవాణా, భూ ఆక్రమణలు, మున్సిపల్ స్థలాలు, తాగునీరు, మౌలిక వసతుల (రోడ్ల మరమ్మతులు, డ్రెయిన్లు) కల్పనలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఎండగట్టారు.

గత ఎన్నికల్లో టిడిపి ఓటమే లక్ష్యంగా జనసేన శ్రేణులు పనిచేశాయి. వైసిపి ప్రభంజనంతోపాటు జనసేన ఓట్లు చీల్చడమూ జిల్లాలో తమ పార్టీ ఓటమికి కారణమనే అభిప్రాయం టిడిపి శ్రేణుల్లో ఉంది. ఈ క్రమంలో రెండు పార్టీలు వచ్చే ఎన్నికల్లో పొత్తులు కుదుర్చుకున్నా క్షేత్రస్థాయిలో పార్టీల మధ్య పరస్పరం ఓట్లు బదిలీ ఏ మేరకు జరుగుతుంది ? జిల్లాలో కూటమి అత్యధిక సీట్లు సాధిస్తుందా? అనేది రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**- డిఎస్ఆర్‌వి.ప్రసాద్**

# పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు

**ప్రజాశక్తి-గంపలగూడెం:** మండలంలోని పలు పురుగు మందుల దుకాణాల్లో శనివారం వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పలు అంశాలు వెల్లడైనట్లు డివిజనల్ అగ్రికల్చర్ ఆఫీసర్ డిఏఓ) నాగమణిమ్మ తెలిపారు. గంపలగూడెం లో జరిగిన తనిఖీల్లో ఎరువులు సంబంధించి అనుమతులు లేనట్లుగా తెలుసుకున్నారు. గ్రోమోర్ దుకాణంలో ఎరువులను గోడౌన్‌లో నిల్వ ఉంచే తీరుపై డిఏఓ నాగమణి అమ్మ ఆగ్రహం చెందారు. ఈ విషయాలను వెంటనే సవరించాలని చెప్పి ఆదేశించారు. అదేవిధంగా స్థానిక పిఎసిఎస్‌లో తనిఖీలు నిర్వహించగా, ఎరువులు పురుగుమందుల అనుమతులు విషయమై సమస్యలున్నట్లు గుర్తించారు. మండలంలోని 43 నర్సరీలకు గాను మూడు నర్సరీలే విత్తన లైసెన్స్ కలిగి దీర్ఘకాలికంగా వ్యాపారం చేస్తున్న పరిస్థితులపై ఆరా తీసినట్లు తెలిసింది. సదరు నకిలీ నర్సరీల యజమానులను ఊటుకూరులో సమావేశపరిచి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. అనతి కాలంలోనే సదర్ నర్సరీలకు అవసరమైన విత్తన లైసెన్సు వగైరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. తిరుగు ప్రయాణంలో తోట మూలలో గల కుమార సాయి జనరల్ ట్రేడర్స్‌లో తనిఖీలు నిర్వహించారు. దుకాణంలో ఉన్న మందుల అమ్మకాలు, కొనుగోళ్ల సాధారణ విషయాలు సైతం రికార్డుల్లో నమోదు చేయలేదన్నట్లు తేలింది. ఈ విషయమై కంప్యూటర్లో నమోదు చేస్తున్నామని యజమానులు తెలుపగా, నాగమణిమ్మ మాట్లాడుతూ మీ దుకాణానికి సంబంధించి అన్ని ఆన్లైన్ లో నేనా అని ప్రశ్నించారు. అనంతరం పి, లైసెన్సులు లేని మందులను షుమారు 6 రకాల పైన గుర్తించి నమోదు చేశారు. స్థానిక ఏవో సాయి శ్రీ దుకాణదారులకు సమస్యలు తలెత్తకుండా (డీఈవో దష్టికి రాకుండా) ప్రయత్నించడం కొసమెరుపు. ఇది ఇలా ఉంటే గతంలో ఇటువంటి సాధారణ తనిఖీలు నెలకు, రెండు నెలలకు జరిగేవి. కానీ ఇటీవల సమస్యలు పెరిగి రైతులు ఇబ్బందులు పడుతున్న సంవత్సరానికి ఒకసారి అయినా అధికారులు దుకాణాల వైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.వచ్చినప్పటికీ శనివారం జరిగిన అరకొర తనిఖీలలా కనిపిస్తున్నాయని, రైతులు విమర్శిస్తున్నారు.

దుకాణంలో తనిఖీ చేస్తున్న నాగమణిమ్మ, తదితరులు

## రోడ్డు భద్రతపై అవగాహన

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** సురక్షితమైన రైడింగ్ సంస్కృతిని పెంపొందించడానికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు హోండా మోటార్ సైకిల్ ఆధ్వర్యంలో నగరంలో అవగాహనా ర్యాలీని శనివారం నిర్వహించినట్లు నసంస్థ సీనియర్ డైరెక్టర్ వినయ్ తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాలలో ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నదే తమ సంస్థ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈకార్యక్రమంలో వీకెఆర్, ఏజీకె కళాశాల, వికెఆర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతాలలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు డ్రైవింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియ చేసినట్లు తెలియచేశారు.

## స్విమ్మింగ్ ఎంపికకు స్పందన

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** కృష్ణా జిల్లా పెనమలూరు మండలం గంగూరులోని బ్లూమింగ్‌డేల్ స్విమ్మింగ్ పూల్‌లో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా అండర్-14, 17, అండర్-19 బాలబాలికల సెల క్షన్స్‌కు స్విమ్మర్ల నుంచి మంచి స్పందన లభించింది. ప్రాథమిక ఎంపిక ట్రయల్స్‌లో 250 మంది స్విమ్మర్లు పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ సెక్రటరీ కె.రాధా కష్ణ పాఠశాల విద్యా శాఖ నుండి పరిశీలకులుగా ఎంపికలకు హాజర య్యారు. కృష్ణాజిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి తోట అజయ్‌తో కలిసి ఎంపిక ట్రయల్స్‌ను ఆయన ప్రారం భించారు. ఎన్టీఆర్ జిల్లా స్విమ్మింగ్ అసోసి యేషన్ సెక్రటరీ ఐ రమేష్, ఇతర అసోసి యేషన్ ప్రతినిధులు, సాంకేతిక అధికారు లు ఎంపిక ట్రయల్స్‌కు మద్దతు ఇచ్చారు. సెలక్షన్ ట్రయల్స్ పూర్తయిన తర్వాత ఉమ్మడి కష్ణా జిల్లాకు సంబంధించి అత్యుత్తమ స్విమ్మర్ల ను ఎస్ జీఎఫ్ జిల్లా సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. త్వరలో జరగనున్న స్కూల్ గేమ్స్ అంతర్-జిల్లా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయి.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో కష్టపడి చదవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. లబ్బీపేటలోని శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్దార్థ మహిళా జూనియర్ కళాశాలను శనివారం ఉదయం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యలో అవలంభిస్తున్న విధానాలను కళాశాల ప్రిన్సిపాల్ పద్మజ వివరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ పకాష్ విద్యార్థులకు ఓరిజినల్ మార్కుల జాబితాలను అందచేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానానికి వెళ్లాలని చదువుకున్న విద్యా సంస్థలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా డివైఈవో సి.ఎస్.ఎస్.ఎన్.రెడ్డి, కృష్ణజిల్లా డివిఇవో పి.ప్రసాద్, ఆర్‌జెడి శారద పలువురు అధికారులు పాల్గొన్నారు.

## బోధనలో నూతనత్వం రావాలి

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించే అధ్యాపకులు నిరంతరం నూతనత్వంతో ముందుకు సాగాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ బీ.రవికాంత్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకుల నైపుణ్యాల మెరుగుదలపై వర్క్‌షాప్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ రవికాంత్ మాట్లాడుతూ అధ్యాపకులు నిత్య విద్యార్థిగా ముందుకు సాగాలన్నారు. ప్రస్తుత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు చాలా మాధ్యమాల ద్వారా సమాచారం తెలుసుకునే అవకాశముందన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీ. కష్ణవేణి, అధ్యాపకులు డాక్టర్ కే. రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.